# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 242 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | గురువారం 23 అక్టోబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 242 23-10-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




**ద్రౌపది ముర్ముకు తప్పిన ప్రమాదం..**

కూరుకుపోయిన హెలికాప్టర్..

3 లో..



## ఉగ్రవాదంపై కలిసి పోరాడదాం

### ట్రంప్‌కు ప్రధాని మోదీ జవాబు

- వైట్‌హౌస్‌లో దీపావళి వేడుకలు జరిపిన ట్రంప్
- ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడానన్న అమెరికా అధ్యక్షుడు
- రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గిస్తామని మోదీ హామీ ఇచ్చారని వెల్లడి
- భారత్-పాక్ యుద్ధాన్ని ఆపింది తానేనని మరోసారి వ్యాఖ్య
- ఉగ్రవాదంపై పోరాటమే ముఖ్యమన్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీతో తాను ఫోన్‌లో మాట్లాడానని, పలు కీలక అంశాలపై ఆయన హామీ ఇచ్చారని ట్రంప్ ప్రకటించగా, అలాంటి ఫోన్ కాల్ ఏదీ జరగలేదని భారత ప్రభుత్వం స్పష్టం చేయడంతో గందరగోళం నెలకొంది. వైట్‌హౌస్‌లో జరిగిన దీపావళి వేడుకల సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, "నేను ఈరోజే మీ ప్రధానమంత్రితో మాట్లాడాను. మా మధ్య గొప్ప సంభాషణ జరిగింది. వాణిజ్యంతో పాటు అనేక విషయాలు చర్చించాం" అని విలేకరులతో అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ గణనీయంగా తగ్గిస్తుందని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ పునరుద్ఘాటించారు. అంతేకాకుండా, గతంలో భారత్-పాకిస్థాన్ మధ్య

- తరువాయి 2లో..

## ఏపీ-యూఏఈ మధ్య పారిశ్రామిక బంధం బలపడేందుకు సహకరించండి



- షిప్ బిల్డింగ్ నుంచి డేటా సెంటర్ల వరకు ఏపీలో అపారమైన అవకాశాలు
- యూఏఈలోని తెలుగువారి అభివృద్ధికి తోడ్పాటు అందించండి
- మోదీ చొరవతోనే దేశంలో విప్లవాత్మక మార్పులు
- దుబాయ్‌లోని భారత ఎంబసీ ప్రతినిధులతో జరిగిన భేటీలో సీఎం చంద్రబాబు

దుబాయ్, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్-యూఏఈ మధ్య పారిశ్రామిక బంధం బలపడేలా సహకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయిలోని భారత రాయబార కార్యాలయం ప్రతినిధులను కోరారు. పెట్టుబడుల సాధనకు, నవంబర్ నెలలో జరిగే భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానాలు పలికేందుకు

- తరువాయి 2లో..





## నవంబర్ 7న ఏపీ కేబినెట్ భేటీ..

### ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

- సచివాలయంలో నవంబర్ 7న ఉదయం 11 గంటలకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం
- వివిధ కీలక అంశాలపై చర్చించిన నిర్ణయం తీసుకోనున్న కేబినెట్
- విశాఖ భాగస్వామ్య సదస్సుపై ప్రధాన చర్చ

అమరావతి అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం నవంబరు 7వ తేదీన జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ సమావేశం జరగనుండగా, ఇందులో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. కొన్ని ముఖ్యమైన అంశాలను ఆమోదించనున్నారు. ప్రతి నెల రెండు సార్లు ఏపీ కేబినెట్ భేటీ నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భాగంగా నవంబర్ నెలలో మొదటి కేబినెట్ బేటీ 7వ తేదీన జరపాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. అజెండాలోని అంశాలకు సంబంధించి అన్ని శాఖలు ప్రతిపాదనలను నవంబర్ 5వ తేదీ సాయంత్రానికి పంపించాలని సీఎస్ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ కేబినెట్ భేటీలో ప్రధానంగా నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ సదస్సుపై

- తరువాయి 2లో..

## ఏపీలో గ్రిఫిత్ యూనివర్సిటీ హబ్..

### మంత్రి లోకేశ్ కీలక ప్రతిపాదన

- ఆస్ట్రేలియాలోని గ్రిఫిత్ యూనివర్సిటీ ప్రతినిధులతో మంత్రి లోకేశ్ భేటీ
- ఏపీలో యూనివర్సిటీ ఇండియా సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన
- ఏపీ వర్సిటీలతో డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లపై కీలక చర్చ
- నైపుణ్యాభివృద్ధికి ఏపీఎస్ఎస్‌డీసీతో కలిసి పనిచేయాలని విజ్ఞప్తి
- పరిశోధన, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలపై ప్రధాన దృష్టి



అమరావతి అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యావకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆస్ట్రేలియాలోని ప్రఖ్యాత గ్రిఫిత్ విశ్వవిద్యాలయంతో భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవ తీసుకున్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆయన, గోల్డ్ కోస్ట్ క్యాంపస్‌లో యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్) మార్నీ వాట్సన్‌తో సమావేశమై కీలక ప్రతిపాదనలు చేశారు. ఏపీలో గ్రిఫిత్ యూనివర్సిటీ ఇండియా సెంటర్ లేదా హబ్‌ను ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, పబ్లిక్ పాలసీ, సస్టైనబిలిటీ, ఇన్నోవేషన్ వంటి రంగాల్లో గ్రిఫిత్ యూనివర్సిటీతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని తెలిపారు. ఏపీలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలైన



- తరువాయి 2లో..

## ప్రభుత్వ యంత్రాంగం.. హై అలెర్ట్..




- ఏపీకి వాయుగుండం ముప్పు... అతి భారీ వర్షాల నేపథ్యంలో హోంమంత్రి అనిత కీలక హెచ్చరిక
- వాయుగుండంగా మారనున్న తీవ్ర అల్పపీడనం
- దక్షిణ కోస్తా, రాయలసీమకు అతి భారీ వర్షాల హెచ్చరిక
- అధికారులతో హోంమంత్రి వంగలపూడి అనిత ఉన్నతస్థాయి సమీక్ష
- సిద్ధంగా ఉండాలని ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలకు ఆదేశాలు
- ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని ప్రజలకు సూచన

అమరావతి అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం రానున్న 12 గంటల్లో వాయుగుండంగా బలపడనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ వాయుగుండం ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర తీరాల వైపు కదులుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులతో బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, వాయుగుండం ప్రభావంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "అత్యవసరమైతే తప్ప ఎవరూ ప్రయాణాలు చేయవద్దు. ప్రాణనష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం" అని ఆమె స్పష్టం చేశారు. సహాయక చర్యల కోసం జాతీయ, రాష్ట్ర విపత్తు స్పందన దళాలు (ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్), పోలీసు, అగ్నిమాపక సిబ్బందిని సర్వసన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో

- తరువాయి 2లో..

## స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్

అమరావతి అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి సమన్వయంతో పోటీ చేయడానికి సన్నద్ధం కావాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. గత 16 నెలల్లో రాష్ట్రానికి ఇప్పటి వరకు కేంద్రం రూ.లక్షన్నర కోట్ల సాయం చేసిందన్నారు. విజయవాడ బందరు రోడ్డు

- తరువాయి 2లో..





## ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

### సిఎం రేవంత్ సంతకం

హైదరాబాద్ అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ రూల్ ను తొలగించే పంచాయతీరాజ్ చట్ట సవరణ ఫైల్ పై

- తరువాయి 2లో..



## ఇరుముడితో పడిమెట్లెక్కిన రాష్ట్రపతి..

### శబరిమలలో ముర్ము ప్రత్యేక పూజలు

- శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఈ పుణ్యక్షేత్రానికి వెళ్లిన తొలి మహిళా దేశాధినేతగా రికార్డు
- సాంప్రదాయబద్ధంగా ఇరుముడి ధరించి 18 పవిత్ర మెట్లు ఎక్కిన వైనం
- వీవీ గిరి తర్వాత శబరిమల వెళ్లిన రెండో భారత రాష్ట్రపతిగా గుర్తింపు
- భక్తిని చాటుకున్నారంటూ రాష్ట్రపతి పర్యటనపై బీజేపీ ఎంపీ బండి సంజయ్ ప్రశంస

కేరళ, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం ఒక చారిత్రక ఘట్టానికి వేదికైంది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం స్వామివారిని దర్శించుకున్నారు. తద్వారా, ఈ ప్రఖ్యాత పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన

- తరువాయి 2లో..

## ఆక్వా రంగ అభివృద్ధికి మంత్రి లోకేష్ కృషి అభినందనీయం

- ఆస్ట్రేలియాతో ఆక్వా బంధం ఏపీ రైతులకు కొత్త అవకాశాలకు నాంది
- ఏపీ ఆక్వా ఉత్పత్తుల నాణ్యత పెంపు, ఎగుమతులకు మంత్రి లోకేష్ ప్రాధాన్యం
- అమెరికా అధిక సుంకాల నేపథ్యంలో కొత్త అంతర్జాతీయ మార్కెట్లు అన్వేషించే లోకేష్ దృష్టి ప్రశంసనీయం
- ఆస్ట్రేలియాలో ఏపీ ఆక్వా రైతుల అభివృద్ధి దిశగా మంత్రి లోకేష్ ఆలోచనలకు మంత్రి అచ్చెన్నాయుడు అభినందనలు



అమరావతి అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్ర ఆక్వా రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకు మంత్రి నారా లోకేష్ గారు చేస్తున్న కృషి అభినందనీయం

- తరువాయి 2లో..

https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం
దినపత్రిక

# సంపాదకీయం

# నో కింగ్స్

అగ్రరాజ్యం అమెరికాలో ప్రజాస్వామ్యం మేడిపండు చందమని 'నో కింగ్స్' పేరుతో వెల్లువెత్తిన ప్రజాగ్రహం ప్రపంచం ముందు చాటిచెప్పింది. 2008 నుంచి వివిధ రూపాల్లో అమెరికా ప్రజలు రోడ్లపైన ఉద్యమిస్తున్నారు. వాల్‌స్ట్రీట్ ముట్టడి తర్వాత అతి పెద్ద నిరసన 'నో కింగ్స్' ఉద్యమం. ట్రంప్ రాజు కాదని, ఇక్కడ రాజులెవరూ లేరని, నిరంకుశ పాలన ఆపాలని, ప్రజలదే నిజమైన అధికారం అంటూ 70 లక్షలమందికి పైగా ముక్తకంఠంతో నినదించారు. ప్రజాస్వామ్య విధ్వంసాన్ని, నియంతృత్వ పోకడలను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. ప్రజాస్వామ్యం పేరుతో గాజా సహా అనేక దేశాల్లో సాగుతున్న మారణహోమంలో భాగస్వామ్యం కావడాన్ని ఈసడించారు.

అధికారం కోసం అడ్డదారులు తొక్కడం, పాలన పగ్గాలు చేపట్టాక కార్పొరేట్ల సేవలో తరించడం, ప్రజల ప్రాథమిక హక్కులను సైతం కాలరాయడం, నిరంకుశ పోకడలు పోవడం 'ప్రజాస్వామ్య' దేశాలుగా చెప్పుకుంటున్న భారత్‌సహా అనేక దేశాల్లో కనిపిస్తోంది. 1789లో ఫ్రెంచి విప్లవం.. ఫ్రాన్స్‌లో రాజరికాన్ని కూకటి వేళ్లతో పెకిలించిన తరువాత 'ప్రజాస్వామ్యం' విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. ప్రజల కొరకు, ప్రజల చేత ఎన్నికై, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమే ప్రజాస్వామ్యం అన్న అబ్రహం లింకన్ నిర్వచనాన్ని నేటికీ అన్వయిస్తూ ఉంటారు. పాలకులు ప్రజల ప్రతినిధులని, ప్రభుత్వం ప్రజలకు సేవ చేయాలని, అధికారమంతా ప్రజల చేతుల్లో ఉండాలన్న స్ఫూర్తి ఏమాత్రం లేని ట్రంప్ లాంటి నేతలకు ప్రపంచంలో కొదవ లేదు. రెండోసారి అధికారంలోకి వచ్చిందే తడవుగా అక్రమ వలసదారుల పేరుతో అమెరికన్లకు ఏళ్ల తరబడి సేవలందించిన వారి కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి, యుద్ధ విమానాల్లో ట్రంప్ తరలించాడు. చిన్నచిన్న దేశాలుసైతం నిలదీసినా, తీవ్రంగా వ్యతిరేకించినా పెదవి విప్పేందుకుసైతం మన పాలకులు సాహసించలేదు. ఈ అంశంపైనా నిరసనకారులు ట్రంప్‌ను నిలదీశారు. 200కుపైగా ప్రజా, పౌర సంస్థల పిలుపు మేరకు అమెరికాలోని 50 రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలన్నిటా జనం కదంతొక్కారు. షికాగోలో రెండున్నర లక్షలకు పైగా ప్రజానీకం రోడ్లపైకి రాగా, వాషింగ్టన్ డిసి సహా పలు నగరాల్లో రెండు లక్షలమందికిపైగా ట్రంప్ పోకడలను నిరసించారు. అమెరికా రాజ్యాంగ ప్రవేశిక ముద్రించిన బ్యానర్‌పై సంతకాలు చేశారు. జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, బ్రిటన్, స్వీడన్‌లాంటి 20 దేశాల్లోని అమెరికా రాయబార కార్యాలయాల వద్ద నిరసనలు పెల్లుబికాయి.

ప్రపంచ దేశాలపై ఇష్టారాజ్యంగా టారిఫ్‌లు ప్రకటించడం, మందులుసహా నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడం, షట్‌డౌన్ విధించడంతో ప్రభుత్వ సేవలు, ఇతర ముఖ్యమైన కార్యక్రమాలన్నీ నిలిచిపోవడం, వేలమంది ఉద్యోగాలు కోల్పోయి రోడ్డునపడటం, ప్రధాన నగరాల్లో సైన్యాన్ని మోహరించడం లాంటి అనేక చర్యలు ప్రజల రోజువారీ జీవనాన్ని అల్లకల్లోలం చేశాయి. ట్రంప్‌పై ప్రజాగ్రహాన్ని రెట్టింపు చేశాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో అధ్యక్ష భవనం వైట్ హౌస్ 'కింగ్ ట్రంప్ లాంగ్ లివ్' పేరుతో ఆయన చిత్రంతో పుస్తకాన్ని ప్రచురించగా, ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'దేశానికి నియంత కావాలని' ప్రజలు కోరుకుంటున్నారని ట్రంప్ స్వయంగా ప్రకటించాడు. రాజకిరీటం ధరించి యుద్ధవిమానంలో నిరసనకారులపై బురద జారవిడుస్తున్న ఎఐ చిత్రాన్ని తాజాగా పోస్టు చేయడం ద్వారా తాను బలమైన రాజునని, నిరసనలను లెక్కచేయబోనని, బురదతో సన్మానిస్తానని సంకేతాలు పంపాడు. ఉపాధ్యక్షుడు సైతం.. ట్రంప్ ముందు డెమొక్రట్లు మోకరిల్లుతున్న ఎఐ చిత్రాన్ని పోస్టు చేశాడు. మన దేశంలోలాగే వీరంతా ప్రజాస్వామ్య వ్యతిరేకులంటూ 'హేట్ అమెరికా ర్యాలీ' అంటూ ప్రచారం చేశారు. గతంలో ఎన్నడూ నిరసనల్లో పాల్గొనని వారు సైతం భాగస్వాములై ఇటువంటి వాదనలను తిప్పికొట్టారు. పాలకుల అహంకార పోకడలను నిట్టనిలువునా పాతిపెట్టిన చరిత్ర ప్రపంచ ప్రజలది. 'నియంతృత్వ పాలనను ప్రతిఘటించడం, నిరసన తెలపడమే అసలైన దేశభక్తి' అని చాటిచెప్పిన అమెరికన్ల ప్రజాస్వామ్య స్ఫూర్తి నిరంకుశత్వాన్ని ఎదిరిస్తున్న ప్రపంచ యువతకు మరింత ఉత్సాహాన్నిచ్చేదే. కులం, మతం, ప్రాంతీయ విద్వేషాలతో రెచ్చగొట్టి, ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేసి, డబ్బు వెదజల్లి అధికారంలోకి వచ్చే పాలకులకు ఓ హెచ్చరిక.

## ఉగ్రవాదంపై కలిసి పోరాడదాం

యుద్ధాన్ని తాను ఆపగలిగానని మరోసారి వ్యాఖ్యానించారు. అయితే, ట్రంప్ చేసిన ఈ ప్రకటనలను భారత ప్రభుత్వం తోసిపుచ్చింది. ప్రధాని మోదీకి, ట్రంప్‌కు మధ్య జరిగిన దీపావళి ఫోన్ సంభాషణలో ఇలాంటి అంశం ప్రస్తావనకు రాలేదని స్పష్టం చేసింది. ఇంధన దిగుమతులపై భారత్ తన ప్రయోజనాలను కాపాడుకుంటుందని, వినియోగదారుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని పరోక్షంగా ఓ ప్రకటన విడుదల చేసింది. మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ ఆన్‌లైన్‌లో ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దీపావళి శుభాకాంక్షలు తెలిపినందుకు ధన్యవాదాలు చెబుతూనే, ఆయన వ్యూహాత్మకంగా స్పందించారు. "మీ ఫోన్ కాల్, దీపావళి శుభాకాంక్షలకు ధన్యవాదాలు. ఈ వెలుగుల పండుగ సందర్భంగా మన రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాలు ప్రపంచానికి ఆశాకిరణంగా నిలవాలి. అన్ని రకాల ఉగ్రవాదంపై కలిసికట్టుగా పోరాడాలి" అని తన పోస్టులో పేర్కొన్నారు. ఉగ్రవాదంపై పోరాటానికి ప్రాధాన్యం ఇస్తూ మోదీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## ఏపీ-యూఏఈ మధ్య పారిశ్రామిక బంధం

## బలపడేందుకు సహకరించండి











యూఏఈలో మూడు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం సీఎం చంద్రబాబు దుబాయ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా దుబాయ్, అబుదాబి దేశాల్లో భారత రాయబార కార్యాలయం ప్రతినిధులతో సీఎం భేటీ అయ్యారు. దుబాయ్ ఇండియన్ కాన్సుల్ జనరల్ సతీష్ కుమార్ శివన్, అబుదాబిలోని ఇండియన్ ఎంబసీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్నాథ్‌తో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. దుబాయ్ సహా యూఏఈ దేశాల్లోని వివిధ కంపెనీల వివరాలు, ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ఏయే రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అనువుగా ఉంటుందనే అంశాలపై వారితో చర్చించారు. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్, పెట్రో కెమికల్స్, పోర్టులు, లాజిస్టిక్స్, ఏవియేషన్, ఇండస్ట్రియల్ పార్కులు, రియల్ ఎస్టేట్, డేటా సెంటర్లు, ఆతిథ్య రంగం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేలా ఏపీలో వనరులు, అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. గూగుల్ సంస్థ విశాఖలో అతిపెద్ద డేటా ఏఐ హబ్ 15 బిలియన్ డాలర్లతో పెట్టుబడులు పెడుతోందని సీఎం వారికి వివరించారు. ఏపీకి 1054



కిలోమీటర్ల పొడవైన సుదీర్ఘ తీరప్రాంతంలో పోర్టులు, ఎయిర్ పోర్టులు, హార్బర్లను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఏపీలో లాజిస్టిక్స్ రంగాన్ని అభివృద్ధి చేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్టు సీఎం వివరించారు. యూఏఈ దేశాల సావరీన్ ఫండ్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపైనా వారితో ముఖ్యమంత్రి చర్చించారు. ఆంధ్రప్రదేశ్ లో వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా దుబాయ్ సహా వివిధ దేశాల కంపెనీలకు వివరించాలని ఎంబసీ ప్రతినిధులకు సీఎం సూచించారు. యూఏఈ -ఏపీ పారిశ్రామిక బంధం ధృఢంగా ఉండేలా చూడాలని సూచించారు. ఇప్పటికే భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి యూఏఈ దేశాలకు చెందిన వివిధ సంస్థలు ముందుకు వచ్చిన నేపథ్యంలో ఏపీలో ఉన్న అవకాశాలను ఆయా దేశాల్లోని కంపెనీలకు వివరించాలని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అనుమతులు ఇస్తోందని అన్నారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో సీఐఐతో కలిసి భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నామని... యూఏఈలోని వివిధ సంస్థలను ఆ సదస్సుకు ఆహ్వానిస్తున్నామని దుబాయిలోని భారత ఎంబసీ ప్రతినిధులకు సీఎం తెలిపారు. ప్రధాని మోదీ చొరవ వల్లే దేశంలో చాలా మార్పులు వచ్చాయని.. భారత్ ను పెద్ద ఎత్తున ఆయన ప్రమోట్ చేస్తున్నారని అన్నారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు పెరగడానికి ప్రధాని చేస్తున్న కృషే కారణమని ముఖ్యమంత్రి తెలిపారు.

### విద్య వైద్య రంగాల్లో యూఏఈ ఆసక్తి

ట్రేడ్ అండ్ టెక్నాలజీ రంగంలో భారత్ దేశానికి యూఏఈ భాగస్వామిగా ఉందని దుబాయ్‌లోని కాన్సులేట్ జనరల్ సతీష్ కుమార్ శివన్ వివరించారు. ఇరుదేశాల పరస్పర పెట్టుబడులతో బంధం మరింత బలపడిందని సీఎంకు వివరించారు. మూడేళ్లలో 50 శాతం మేర ఇరుదేశాల మధ్య వాణిజ్యం పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం యూఏఈ టెక్నాలజీ రంగంపై ఎక్కువగా వ్యయం చేస్తోందని భారత్ నుంచి వచ్చే నిపుణులకు భారీ ఎత్తున అవకాశాలు ఉన్నాయని సీఎంకు వివరించారు. ప్రస్తుతం యూఏఈ నాన్ ఆయిల్ ఎకానమీ వైపుగా దృష్టి పెట్టిందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై యూఏఈ 2017లోనే ఓ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసిందని సీఎంకు సతీష్ కుమార్ శివన్ తెలిపారు. మరోవైపు యూఏఈలో 23 బిలియన్ డాలర్ల పెట్టుబడులు భారత్ పెట్టిందని ఇందులో 50 శాతం గత ముడేళ్లలో వచ్చినవేనని యూఏఈలోని డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ ఏ.అమర్నాధ్ తెలిపారు. భారత్ లోని విద్య వైద్య రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈ ఆసక్తి చూపుతోందని వివరించారు. గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ పార్క్ లోనూ యూఏఈ నుంచి పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అమర్నాధ్ తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సీఎంకు సాదర స్వాగతం

దుబాయ్‌లోని అంతర్జాతీయ స్థాయి సంస్థలకు అవసరమైన టెక్నాలజీ నిపుణులను అందించేందుకు ఏపీ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. యూఏఈలో తెలుగువాళ్లు ఉన్నారని...వారికి అవసరమైన సహకారాన్ని అందించాలని ఎంబసీ ప్రతినిధులను సీఎం చంద్రబాబు కోరారు. దుబాయ్ లో తన పర్యటన చివరి రోజున తెలుగు డయాస్పోరా కార్యక్రమం నిర్వహించనున్నట్టు సీఎం చంద్రబాబు చెప్పారు. అంతకు ముందు హైదరాబాద్ నుంచి దుబాయ్ కు చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడుకు స్థానిక తెలుగు ప్రజలు విమానాశ్రయానికి వచ్చి ఘనంగా స్వాగతం పలికారు. దుబాయిలో ఉన్న తెలుగు వారు.. ప్రత్యేకించి మహిళలు తెలుగు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం తెలియచేశారు. తనకు స్వాగతం పలకడానికి వచ్చిన వారిని సీఎం అప్యాయంగా పలకరించారు.

## నవంబర్ 7న ఏపీ కేబినెట్ భేటీ..

చర్చించనున్నారు. సదస్సుపై ఇప్పటికే మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించిన నేపథ్యంలో కమిటీ సూచనలపై కూడా కేబినెట్ భేటీలో చర్చించనున్నారు. దీంతో పాటు రాజధాని అమరావతి పనులు, వివిధ సంస్థలకు భూముల కేటాయింపులపై కూడా కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇదే సందర్భంలో ప్రభుత్వ నిర్ణయాలపై ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలు, విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టే విషయంపై మంత్రులకు సీఎం చంద్రబాబు కీలక సూచనలు చేయనున్నారని సమాచారం.

## ఏపీలో గ్రిఫిత్ యూనివర్సిటీ హబ్..

## మంత్రి లోకేశ్ కీలక ప్రతిపాదన

ఎస్ఆర్ఎం-ఏపీ, ఆంధ్రా యూనివర్సిటీ, విట్-ఏపీ వంటి సంస్థలతో కలిసి డ్యూయల్-డిగ్రీ, ట్విన్నింగ్ ప్రోగ్రామ్‌లను అభివృద్ధి చేయాలని సూచించారు. సిలబస్ రూపకల్పన, నైపుణ్య ధ్రువీకరణ కోసం ఏపీఎస్ఎస్‌డీసీతో భాగస్వామ్యం కావాలని కోరారు. పునరుత్పాదక శక్తి, ప్రజారోగ్యం, నీటి నిర్వహణ వంటి అంశాలపై సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు చేపట్టాలని ఆయన ప్రతిపాదించారు. అలాగే, ఏపీలో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలిసి పనిచేయాలని లోకేశ్ కోరారు. వచ్చే నెల 14, 15 తేదీల్లో రాష్ట్రంలో నిర్వహించనున్న పార్ట్నర్‌షిప్ సమ్మిట్ - 2025, గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫోరమ్ సమావేశాలకు హాజరుకావాలని మార్నీ వాట్సన్‌ను ఆయన ఆహ్వానించారు. అంతకుముందు మార్నీ వాట్సన్ తమ విశ్వవిద్యాలయం గురించి మంత్రి లోకేశ్‌కు వివరించారు. 1975లో స్థాపించిన గ్రిఫిత్ యూనివర్సిటీ, ప్రపంచంలోని అగ్రశ్రేణి పబ్లిక్ విశ్వవిద్యాలయాలలో ఒకటిగా నిలిచిందని తెలిపారు. తమ ఐదు క్యాంపస్‌లలో 50 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని, భారత్‌లో ఐఐటీ రూర్కీతో కలిసి ఇప్పటికే పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మంత్రి లోకేశ్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ యంత్రాంగం.. హై అలెర్ట్

కంట్రోల్ రూమ్‌లను 24 గంటలూ పనిచేసేలా చూడాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులపై హెచ్చరిక సందేశాలు పంపాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర సహాయం కోసం ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్లను అందుబాటులోకి తెచ్చిందని, ప్రజలు 112, 1070, లేదా 18004250101 నెంబర్లను సంప్రదించాలని హోంమంత్రి విజ్ఞప్తి చేశారు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి : బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్

లెమన్‌ట్రీ హోటల్‌లో బుధవారం ఆ పార్టీ పదాధికారుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి, పలువురు ఎమ్మెల్యేలు, పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతకం చేశారు. గురువారం మంత్రివర్గ ఆమోదం తర్వాత ఈ ఫైల్ గవర్నర్ వద్దకు వెళ్లనుంది. ఆయన సంతకం తర్వాత ఆర్డినెన్స్ జారీ చేస్తారు. దాని ప్రకారం వార్డు మెంబర్, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఎంత మంది పిల్లలు ఉన్నా పోటీ చేయవచ్చు.

## ఇరుముడితో

## పడిమెట్లెక్కిన రాష్ట్రపతి..

తొలి మహిళా దేశాధినేతగా ఆమె చరిత్ర సృష్టించారు. గతంలో 1970లలో మాజీ రాష్ట్రపతి వీవీ గిరి శబరిమలను సందర్శించగా, ఆ తర్వాత అయ్యప్పను దర్శించుకున్న రెండో భారత రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము నిలిచారు. కేరళలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆమె శబరిమలకు చేరుకున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు పంబా బేస్ క్యాంపు వద్దకు వచ్చిన ఆమె, మొదట పంపా నదిలో పాదాలను శుభ్రం చేసుకుని, సమీపంలోని గణపతి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం నల్ల చీర ధరించి సంప్రదాయబద్ధంగా 'కెట్టునిర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆమె 'ఇరుముడికెట్టు'ను సిద్ధం చేశారు. రాష్ట్రపతితో పాటు ఆమె అల్లుడు గణేష్ చంద్ర హోంబ్రామ్, ఇతర సిబ్బంది కూడా ఇరుముడిని సిద్ధం చేసుకున్నారు. పంబ నుంచి ప్రత్యేక వాహనంలో సన్నిధానానికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ తంత్రి కందరారు మహేష్ మోహనారు 'పూర్ణకుంభ' స్వాగతం పలికారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి వీఎన్ వాసవన్ కూడా ఆమెకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ద్రౌపది ముర్ము పవిత్రమైన ఇరుముడిని తలపై పెట్టుకుని, 18 మెట్లను ఎక్కి అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఆమె ఇరుముడిని ప్రధాన అర్చకులు తీసుకుని పూజలు నిర్వహించారు. ఆ తర్వాత మాలికాపురం ఆలయాన్ని కూడా ఆమె సందర్శించారు. రాష్ట్రపతి పర్యటనపై బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "ఆమె వయసు 67. ఆమె ఏ నిబంధనలను ఉల్లంఘించలేదు, ఏ విశ్వాసాన్ని గాయపరచలేదు %-% కేవలం గౌరవించారు. ఇరుముడితో అయ్యప్పను దర్శించుకున్న తొలి రాష్ట్రపతిగా నిలిచారు" అని ఆయన పేర్కొన్నారు. "భక్తి అనేది నిశ్శబ్దంగానే నిలబడుతుందని ఈ పర్యటన గుర్తుచేసింది. కోట్లాది అయ్యప్ప భక్తులను ఏకం చేసే విశ్వాసానికి ఈ క్షణం అద్దం పడుతోంది" అని ఆయన తన పోస్టులో రాశారు. మహిళల ప్రవేశంపై 2018లో సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఒక మహిళా దేశాధినేత ఆలయాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, రాష్ట్రపతి పర్యటన సందర్భంగా సాధారణ భక్తుల ప్రవేశాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు అధికారులు తెలిపారు.

## ఆక్వా రంగ అభివృద్ధికి మంత్రి లోకేష్

## కృషి అభినందనీయం

అని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు పేర్కొన్నారు. ఆస్ట్రేలియాతో ఆక్వా బంధం కొత్త అవకాశాలకు నాంది కానుందని ఆయన అన్నారు. అమెరికా విధించిన అధిక సుంకాల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఏపీ ఆక్వా ఉత్పత్తులకు కొత్త మార్కెట్లు కల్పించాలనే లోకేష్ దూరదృష్టి ప్రశంసనీయం అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఏపీ ఆక్వా రైతుల అభివృద్ధి దిశగా ఆలోచించిన మంత్రి లోకేష్ నిబద్ధతను ఆయన అభినందించారు. ఆక్వా ఉత్పత్తుల నాణ్యత పెంపు, నిల్వ సామర్థ్యం, ప్రాసెసింగ్, కోల్డ్ చైన్, ప్యాకేజింగ్ రంగాల్లో ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల రైతులకు లాభం చేకూరుతుందని తెలిపారు.

ఏపీ సీ ఫుడ్ బ్రాండ్‌కి అంతర్జాతీయ గుర్తింపు తేవాలన్న మంత్రి లోకేష్ సంకల్పం రాష్ట్రానికి గౌరవం తెస్తుందని అన్నారు. రాష్ట్రానికి 1,000 కిలోమీటర్ల విస్తీర్ణం గల సముద్రతీరం ఆక్వా పరిశ్రమకు బలమైన ఆధారమని, ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రభుత్వం చురుకుగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, సాంకేతిక రంగాల్లో మంత్రి లోకేష్ చూపుతున్న ప్రగతిశీల ఆలోచనలను ప్రశంసిస్తూ, వెస్టన్ సిడ్నీ వర్సిటీతో సంయుక్త పరిశోధన కార్యక్రమాలకు తీసుకుంటున్న చర్యలు ఆహ్వానించదగినవని అన్నారు. రైతులకు స్మార్ట్ ఫార్మింగ్ టెక్నాలజీ అందించే చర్యలు ప్రశంసనీయం అని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం పెట్టుబడుల వర్షం కురుస్తోందని, ఆక్వా రంగం అభివృద్ధి ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# అమరావతికి భారీ విరాళం..

- ప్రపంచస్థాయి గ్రంథాలయానికి శోభా గ్రూప్ రూ.100 కోట్లు
- అమరావతి అభివృద్ధికి దుబాయ్ సంస్థ శోభా రియాల్టీ భారీ విరాళం
- ప్రపంచ స్థాయి లైబ్రరీ నిర్మాణం కోసం రూ.100 కోట్లు కేటాయింపు
- సీఎం చంద్రబాబు దుబాయ్ పర్యటనలో కీలక ప్రకటన
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని శోభా గ్రూప్‌కు ముఖ్యమంత్రి ఆహ్వానం
- అమరావతిని అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు వెల్లడి




**దుబాయ్, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి భారీ ఊతం లభించింది. దుబాయ్‌కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ దిగ్గజం శోభా రియాల్టీ గ్రూప్, అమరావతిలో ప్రపంచ స్థాయి గ్రంథాలయం (లైబ్రరీ) నిర్మాణానికి రూ.100 కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించింది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సీఎం చంద్రబాబు చేపట్టిన దుబాయ్ పర్యటనలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. దుబాయ్‌లో శోభా రియాల్టీ గ్రూప్ ఛైర్మన్ రవి మేనన్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రవి మేనన్ మాట్లాడుతూ.. అమరావతిలో గ్లోబల్ ప్రమాణాలతో ఒక స్టేట్ లైబ్రరీని ఏర్పాటు చేసేందుకు తమ సంస్థ తరఫున ఈ విరాళాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. శోభా గ్రూప్ తీసుకున్న ఈ నిర్ణయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. అమరావతిని ప్రపంచంలోని ఉత్తమ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్న తన ఆశయానికి ఈ విరాళం ఎంతగానో దోహదపడుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఏపీలో పెట్టుబడులకు గల అపార అవకాశాలను చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించేందుకు ఏపీకి రావాలని రవి మేనన్‌ను ఆయన ఆహ్వానించారు. అమరావతిని ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తున్నామని, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీ, విశాఖపట్నంలోని గూగుల్ డేటా సెంటర్ వంటి ప్రాజెక్టులు ఇప్పటికే పురోగతిలో ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి వంటి నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్లు, పోర్టు ఆధారిత అభివృద్ధి జోన్లలో టౌన్‌షిప్‌లు, లగ్జరీ హోటళ్లు, ఐటీ పార్కులు, మాల్స్, కన్వెన్షన్ సెంటర్లు, ప్రీమియం హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టవచ్చని సూచించారు. శోభా గ్రూప్ తమ ఆదాయంలో 50 శాతం సామాజిక సేవా కార్యక్రమాలకు కేటాయించడాన్ని చంద్రబాబు ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం పీ4 నమూనాతో "జీరో పావర్టీ మిషన్" అమలు చేస్తున్నట్లు తెలిపారు. తమ సంస్థ దుబాయ్, ఒమన్, బహ్రెయిన్, ఖతార్, బ్రూనై దేశాలతో పాటు భారతదేశంలోని 14 రాష్ట్రాల్లోని 27 నగరాల్లో ప్రాజెక్టులు నిర్వహిస్తోందని రవి మేనన్ ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరుకావాలని శోభా రియాల్టీ యాజమాన్యాన్ని చంద్రబాబు ప్రత్యేకంగా ఆహ్వానించారు.

# ద్రౌపది ముర్ముకు తప్పిన ప్రమాదం..

## కూరుకుపోయిన హెలికాప్టర్..

- కేరళ పర్యటనలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ప్రమాదం
- కొచ్చి స్టేడియంలో బురదలో కూరుకుపోయిన హెలికాప్టర్
- నాలుగు రోజుల పర్యటనలో భాగంగా జరిగిన ఘటన
- అతి కష్టం మీద పక్కకు నెట్టిన భద్రతా సిబ్బంది
- శబరిమల దర్శనానికి వెళ్తుండగా ఘటన





భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కేరళ పర్యటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఆమె ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ల్యాండింగ్ సమయంలో బురదలో కూరుకుపోవడంతో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అయితే, భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తేవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నాలుగు రోజుల పర్యటన నిమిత్తం కేరళలో ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా ఇవాళ ఆమె శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకోవాల్సి ఉంది. ఇందుకోసం కొచ్చిలోని ప్రమదం స్టేడియానికి హెలికాప్టర్‌లో చేరుకున్నారు. అయితే, హెలికాప్టర్ ల్యాండ్ అయిన సమయంలో దాని టైర్లు ఒకవైపు బురదలో పూర్తిగా దిగబడిపోయాయి. దీంతో అక్కడ ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో హెలికాప్టర్‌ను అతి కష్టం మీద బురద నుంచి బయటకు నెట్టి సురక్షిత ప్రదేశానికి చేర్చారు. ఈ అనూహ్య ఘటనతో షెడ్యూల్ కొద్దిసేపు నిలిచిపోయింది. అనంతరం, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అక్కడి నుంచి శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి బయలుదేరి వెళ్లారు. ఈ ఘటనతో అధికారులు భద్రతా ఏర్పాట్లపై సమీక్ష చేపట్టారు.

# ఏపీలో షిప్ బిల్డింగ్ యూనిట్‌కి ట్రాన్స్ వరల్డ్ గ్రూప్‌కు ఆహ్వానం

## వైద్యారోగ్య రంగంలో పెట్టుబడి పెట్టాలని బుర్జిల్ సంస్థను కోరిన సీఎం

## సీఎం చంద్రబాబుతో సమావేశంలో పెట్టుబడులకు ఆసక్తి కనపర్చిన దుబాయ్ పారిశ్రామికవేత్తలు




**దుబాయ్, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానాలకు యూఏఈ పారిశ్రామిక వేత్తలు సానుకూలంగా స్పందిస్తున్నారు. యూఏఈలో మూడు రోజుల పర్యటనలో భాగంగా తొలిరోజు దుబాయ్ లో బుధవారం పర్యటించిన చంద్రబాబు..అక్కడి పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు నిర్వహించారు. దీంట్లో భాగంగా ట్రాన్స్ వరల్డ్ గ్రూప్ ఛైర్మన్ రమేష్ ఎస్ రామకృష్ణన్, బుర్జిల్ హెల్త్ కేర్ హెూల్డింగ్స్ ఛైర్మన్ షంషీర్ వయాలిల్‌తో ముఖ్యమంత్రి వరుస సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను వివరించారు. ఈ క్రమంలో షిప్ బిల్డింగ్, లాజిస్టిక్స్ రంగంలో పేరొందిన ట్రాన్స్ వరల్డ్ గ్రూప్ ఛైర్మన్‌కు రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధిపై సీఎం వివరించారు. సుదీర్ఘ తీర ప్రాంతం ఉందని..పోర్టులు, ఎయిర్ పోర్టుల నిర్మాణంతోపాటు... షిప్ బిల్డింగ్ ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నట్టు సీఎం ఆ సంస్థ ఛైర్మన్ రామకృష్ణన్‌కు తెలిపారు. దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ నిర్మించే దిశగా ప్రణాళికలు చేస్తున్నట్టు వివరించారు. దీనిపై ట్రాన్స్ వరల్డ్ గ్రూప్ సానుకూలంగా స్పందించింది. ఏపీలో షిప్ బిల్డింగ్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. రాష్ట్రంలో లాజిస్టిక్స్ వ్యయం తగ్గించే ఆలోచనలతో తాము పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. మూలపేట, రామాయపట్నం, మచిలీపట్నం పోర్టులు త్వరలోనే అందుబాటులోకి రానున్నట్టు సీఎం చెప్పారు. రైలు, పోర్టులు, ఎయిర్ పోర్టుల కనెక్టివిటీ ఉండేలా ప్రణాళికలు రూపొందించినట్టు ట్రాన్స్ వరల్డ్ గ్రూప్ ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించారు.

వైద్యారోగ్య రంగంలో పెట్టుబడులకు ఆహ్వానం అబుదాబిలోని వైద్యారోగ్య రంగంలో ప్రతిష్టాత్మక సంస్థ బుర్జిల్ హెల్త్ కేర్ హెూల్డింగ్స్ ఛైర్మన్ షంషీర్ వయాలిల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అయ్యారు. ఆ రంగంలో ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు బుర్జిల్ హెల్త్ కేర్ హెూల్డింగ్స్ సంస్థ ఆసక్తి కనబరిచింది. తిరుపతిలో స్పెషల్ క్యాన్సర్ సెంటర్ నిర్మాణానికి ముందుకు వచ్చింది. రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్‌పై తమ సంస్థకు విశేషమైన అనుభవం ఉందని సంస్థ ప్రతినిధులు సీఎంకు వివరించారు. అబుదాబిలో అతి పెద్ద క్యాన్సర్ ఆస్పత్రిని నిర్వహిస్తున్నట్టు తెలిపింది. బుర్జిల్ సంస్థ ఛైర్మన్‌తో భేటీలో భాగంగా వైద్యారోగ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులను సీఎం వివరించారు. వైద్యారోగ్య రంగంలో ప్రివెంటివ్-క్యూరేటీవ్ అనే విధానాన్ని అవలంభిస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో హెల్త్ కార్డుల డిజటలీకరణ ప్రాజెక్టును పైలెట్ గా చేపట్టినట్టు చంద్రబాబు వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్ తో పాటు పరిశ్రమలశాఖ, ఈడీబీకి చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# లాజిస్టిక్స్, గిడ్డంగుల ఏర్పాటుకు రాష్ట్రానికి రండి

## షరాఫ్ గ్రూప్ సంస్థకు సీఎం చంద్రబాబు ఆహ్వానం

**దుబాయ్, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

షరాఫ్ గ్రూప్ వైస్ ఛైర్మన్, షరాఫ్ డీజీ సంస్థ వ్యస్థాపకుడు షరాఫుద్దీన్ షరాఫ్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు గల అవకాశాలపై షరాఫ్‌తో చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మౌలిక వసతులు, మావన వనరుల లభ్యత, అలాగే ఇతర అనుకూలతల గురించి వివరించారు. బుధవారం యూఏఈలో తొలిరోజు పర్యటనలో భాగంగా షరాఫ్ గ్రూప్ వైస్ ఛైర్మన్‌తో సమావేశమైన సీఎం... ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్ ప్రాజెక్టుల ఏర్పాటు గురించి ప్రధానంగా చర్చించారు. షరాఫ్ గ్రూప్ ఇప్పటికే భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో లాజిస్టిక్స్ పార్కులను అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో ఏపీ చేపట్టిన పారిశ్రామిక కారిడార్లలో ఆధునిక లాజిస్టిక్స్ పార్కులు, గిడ్డంగులు స్థాపించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. దీనికి ఆసక్తి చూపిన షరాఫ్ గ్రూప్ తమ అనుబంధ సంస్థ అయిన హింద్ టెర్మినల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్, గిడ్డంగి సదుపాయాలను ఏర్పాటు చేయడానికి ఆసక్తి కనబరిచింది. ఇందుకోసం రైల్వే, పోర్ట్ అనుసంధానం కలిగిన ప్రాంతాన్ని గుర్తించాలని షరాఫ్ గ్రూప్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.




**అవసరమైతే పాలసీల్లో మార్పులు చేస్తాం**

'మా రాష్ట్రంలో పోర్టులు, నేషనల్ హైవేలు విస్తారంగా ఉన్నాయి. కార్గో రవాణాకు రాష్ట్రం అనుకూలం. మేం ఇప్పుడు కొత్త పాలసీలు తెచ్చాం. రాష్ట్రానికి మేలు జరుగుతుందనుకుంటే పాలసీల్లో మార్పులు తేవడానికి సిద్ధం. లాజిస్టిక్స్‌పై 14 శాతం ఖర్చు పెడుతున్నాం. దీన్ని 8 నుంచి 9 శాతానికి తగ్గించాలని చూస్తున్నాం. ఇందుకోసం పోర్టులు, జాతీయ రహదారులు, రైల్వే, రహదారి ప్రాజెక్టులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. లాజిస్టిక్ వ్యయం తగ్గించడానికి సహకరించండి. రాయలసీమలో ఆటోమొబైల్ పరిశ్రమలు వస్తున్నాయి. నవంబర్ 14,15 తేదీల్లో విశాఖలో జరిగే పెట్టుబడిదారుల సదస్సుకు హాజరుకండి.' అని షరాఫ్ గ్రూప్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి అన్నారు. దీనికి స్పందించిన ఆ సంస్థ ప్రతినిధులు భారత్‌లో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నామని, ఆంధ్రప్రదేశ్‌కు తప్పనిసరిగా వస్తామని చెప్పారు.











దుబాయ్ ఫ్యూచర్ మ్యూజియంను మంత్రులు, అధికారులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు సందర్శించారు. దీన్ని లివింగ్ మ్యూజింగ్‌గా రూపొందించారు. అంతరిక్షం, వాతావరణం, ఆరోగ్యం, విద్య, వైద్యం, ఏఐ వంటి రంగాల్లో భవిష్యత్ ఆవిష్కరణలు ఏవిధంగా ఉండబోతున్నాయనేది టెక్నాలజీని ఉపయోగించి మ్యూజియంలో ప్రదర్శణలు చేస్తున్నట్లు అక్కడి అధికారులు వివరించారు. ఫ్యూచర్ జర్నీ పేరుతో ఏర్పాటు చేసిన ఎక్సీపీరియన్స్ జోన్‌ను సీఎం చంద్రబాబు సందర్శించారు.

# న్యూ సౌత్ వేల్స్ (ఎన్ఎస్‌డబ్ల్యూ) ప్రీమియర్ క్రిస్ మిన్స్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ

## విశాఖ పార్టనర్‌షిప్ సమ్మిట్ కు ప్రతినిధి బృందాన్ని పంపాల్సిందిగా ఆహ్వానం



ఆస్ట్రేలియా (సిడ్నీ): న్యూ సౌత్ వేల్స్ (NSW) ప్రీమియర్ క్రిస్ మిన్స్ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... అడ్వాన్స్ డ్ మ్యానుఫ్యాక్చరింగ్, స్టార్టప్‌లు, గ్రీన్ టెక్నాలజీలలో సహకారాన్ని ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్-న్యూ సౌత్ వేల్స్ ఇన్నోవేషన్ & ఇండస్ట్రీ భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఇన్నోవేషన్, వాణిజ్యం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో న్యూ సౌత్ వేల్స్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య ఒప్పందాన్ని (MoU) సులభతరం చేయండి. న్యూ సౌత్ వేల్స్ ఇన్నోవేషన్ క్లస్టర్లను ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఇన్నోవేషన్ & స్టార్టప్ హబ్‌లతో (విశాఖపట్నం, అమరావతి, అనంతపురం) అనుసంధానించే ఎక్స్ఛేంజి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వండి. రెన్యూవబుల్ ఎనర్జీ, మెడిటెక్, అగ్రిటెక్, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పనిచేస్తున్న న్యూ సౌత్ వేల్స్ కంపెనీలు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమ కారిడార్లలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సాహించండి. క్లీన్ టెక్, కృత్రిమ మేధస్సు (AI), సస్టైనబుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో పరిశోధన & అభివృద్ధి (R&D) కోసం న్యూ సౌత్ వేల్స్ విశ్వవిద్యాలయాలు, ఆంధ్రప్రదేశ్ విద్యాసంస్థల మధ్య సహకారానికి ప్రోత్సహం అందించండి. విశాఖపట్నంలో జరగనున్న పార్టనర్‌షిప్ సమ్మిట్ -2025కి న్యూ సౌత్ వేల్స్ మంత్రి నేతృత్వంలో వ్యాపార ప్రతినిధి బృందాన్ని ఆంధ్రప్రదేశ్ కు పంపించండి. ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డును (APEDB) న్యూ సౌత్ వేల్స్ ఆసియా-పసిఫిక్ వాణిజ్య కార్యక్రమాల్లో చేర్చేందుకు సహకారం అందించండి. న్యూ సౌత్ వేల్స్ ఇన్నోవేషన్ ఏజెన్సీలు, ఆంధ్రప్రదేశ్‌లోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ల ద్వారా సంయుక్త ఇంక్యుబేషన్ కార్యక్రమాలను అన్వేషించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో ఎన్ఎస్ డబ్లు ఇన్నొవేషన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి అనౌలాక్ చాంథివోంగ్ కూడా పాల్గొన్నారు.

జనరల్ న్యూస్
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

## ఆగి ఉన్న కూరగాయల ఆటోకు బొలెరా ఢీ!

**మహిళ మృతి- ఇద్దరికి విరిగిన కాళ్లు - తొమ్మిదిమందికి తీవ్ర గాయాలు.**





**చింతపల్లి, అక్టోబర్ 22 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** ఆగి ఉన్న కూరగాయల ఆటోకు వేగంగా దూసుకొచ్చిన బొలెరా వాహనం ఢీకొని విషాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, ఇద్దరికి కాలులు విరిగాయి. మరో తొమ్మిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ హృదయ విదారక ఘటన గూడెం కొత్త వీధి మండలం రింతాడ మాలీ వీధి గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గూడెం కొత్త వీధి మండలం సంకాడ పంచాయతీ చిత్తమామిడి గ్రామానికి చెందిన రైతులు పండించిన కూరగాయలను చింతపల్లి వారపు సంతకు తరలించేందుకు ఆటోలో బయల్దేరారు. రింతాడ మాలీ వీధి గ్రామం వద్ద మరికొందరు రైతులు కూరగాయలు ఎక్కిస్తున్న సమయంలో శాంతి సాధన పాఠశాలకు చెందిన బొలెరా వాహనం వేగంగా దూసుకొచ్చి ఆగి ఉన్న ఆటోకు బలంగా ఢీకొట్టింది. ఢీ బలాన్ని తట్టుకోలేక ఆటోలో ప్రయాణిస్తున్న 12 మంది ఎగిరిపడి రోడ్డు పక్కకు పడిపోయారు. ఈ ఘటనలో తులసి (60) తీవ్రంగా గాయపడి చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. లక్ష్మి 35, గోవర్ధన్ 30 లకు కాళ్లు విరిగాయి. మరో 9 మంది పద్మ 35, గణపతి (30), మోహనరావు (55), పాంగి కొమ్ములు, గుంట ముకుంద్, కిలో బుజ్జిబాబు, గోవర్ధన్ తదితరులకు స్వల్ప గాయాలతో విలవిలలాడారు. గ్రామస్థులు అప్రమత్తమై గాయపడిన వారిని వెంటనే ఆటోలో చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు తులసిని పరీక్షించి మరణించినట్లు ధృవీకరించారు. కాలు విరిగిన లక్ష్మి, గోవర్ధన్ లను మెరుగైన వైద్య సేవల కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న జి.కె. వీధి ఎస్ఐ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదంలో మృతురాలి మృతదేహాన్ని చూసి గ్రామంలో ఆవేదన అలుముకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరు అయ్యారు. తులసి మృతితో రింతాడ గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది.

## నడుము వీధి అందాల వనంలో...
## ఇంద్ర ధనస్సు సోయగం



**చింతపల్లి, అక్టోబర్ 22 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** జీకే వీధి మండలం వంచుల పంచాయతీ పరిధిలోని నడుము వీధి గ్రామం బుధవారం సాయంత్రం అద్భుతమైన ప్రకృతి అందాలతో కళకళలాడింది. సాయంత్రం సమయంలో కురిసిన తేలికపాటి జల్లుల అనంతరం ఆకాశం ఒక్కసారిగా రంగుల మేళవింపుతో మెరిసిపోయింది. ఏడు రంగుల ఇంద్రధనుస్సు పచ్చని పర్వతాల మధ్య విరజిల్లి గ్రామం చుట్టుపక్కల ప్రాంతాలను మంత్రముగ్ధులను చేసింది. గ్రామంపై నుంచి కనువిందు చేసిన ఆ ఇంద్రధనుస్సు దృశ్యం, పచ్చని పొలాలపై పడిన కాంతి ప్రతిబింబం కలిసి మానవ హృదయాలను ఆకట్టుకున్నాయి. గ్రామస్తులు ఆనందంతో ఉత్సాహంగా తిలకిస్తూ ఇంత అద్భుతమైన ఇంద్రధనుస్సు సంవత్సరాల తర్వాత మా ఊర్లో కనిపించింది. ప్రకృతి మన ఊరికి పూలమాల వేసినట్టుందని సంతోషం వ్యక్తం చేశారు. చిన్నారులు ఆకాశం వైపు చూపుతూ ఆనందోత్సాహాలతో పరుగులు తీశారు. కొంతమంది యువకులు ఆ అద్భుత క్షణాలను తమ మొబైల్ ఫోన్లలో బంధించి సోషల్ మీడియాలో పంచుకున్నారు. కాసేపు ఆకాశాన్ని అలంకరించిన ఆ ఇంద్రధనుస్సు, గ్రామానికి పండుగ వాతావరణాన్ని తెచ్చింది. ఇలాంటి దృశ్యాలు పర్వత ప్రాంతాల్లో తరచుగా కనిపిస్తుంటాయి. వర్షం, సూర్యకాంతి కలయికలో పుడే ఈ ఇంద్రధనుస్సులు ప్రకృతి సౌందర్యానికి ప్రతీకలు అని నడుము వీధి గ్రామస్తులు పేర్కొన్నారు.

## డేరాల జంక్షన్ వద్ద
## 41 కేజీల గంజాయి స్వాధీనం!

**జీకే వీధి ఎస్సై సురేష్.**




**చింతపల్లి, అక్టోబర్ 22 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** అల్లూరి సీతారామరాజు జిల్లాలో పోలీసులు అక్రమ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు. గూడెం కొత్త వీధి పోలీసులకు మరో విజయవంతమైన ఆపరేషన్‌గా నిలిచిన ఈ చర్యలో 41 కేజీల గంజాయి స్వాధీనం, ఒకరిని అరెస్ట్ చేశారు. మండలంలోని డేరాల జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, పోలీసులు అనుమానాస్పదంగా వస్తున్న ఏపీ 39 కెఎం 4224 నంబర్ కారును ఆపి తనిఖీ చేశారు. అందులో బస్తాల్లో నింపిన గంజాయి 41 కిలోలు లభించింది. దారకొండ గ్రామానికి చెందిన కలిదిండి నూకరాజు (తండ్రి శ్రీనివాసరావు) గంజాయిని మైదాన ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీల్లో నిందితుడి వద్ద నుండి రూ.80 వేల నగదు, మొబైల్ ఫోన్, మరియు కారును స్వాధీనం చేసుకున్నారు. గూడెం కొత్త వీధి ఎస్సై సురేష్ నాయకత్వంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో పోలీసులు కీలక పాత్ర పోషించారు. ఎస్సై సురేష్ మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో గంజాయి రవాణా ముఠాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఎవరు చట్టాన్ని ఉల్లంఘించినా ఉపేక్షించం. పట్టు బడిన వ్యక్తిని కోర్టులో హాజరు పరిశ్రమన్నారు. నిందితులపై దర్యాప్తు కొనసాగుతోందని హెచ్చరించారు. గంజాయి పట్టుబడిన దాడిలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నాలుగు నెలల్లోనే ముక్కలైన పంచాయితీ రోడ్డు..!

- **గిరిజన సంక్షేమ శాఖ పర్యవేక్షణలో నిర్లక్ష్యం**
- **నాణ్యత ప్రమాణాలు పాటించని గుత్తేదారుడు..!**
- **అంజలి శనివారం పంచాయతీ ప్రజలకు రవాణా రగడ- ప్రభుత్వ నిధులు వృథా..!**





**చింతపల్లి, అక్టోబర్ 22 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలోని మారుమూల అంజలి శనివారం పంచాయతీ ప్రజలు మళ్లీ రహదారి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 20 ఏళ్లుగా ఎదురుచూసిన రహదారి కల నెరవేరిందని అనుకున్న ప్రజల ఆశలు కేవలం నాలుగు నెలల్లోనే మట్టి మయమయ్యాయి. అంజలి శనివారం పంచాయతీ ప్రజలతోపాటు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు నిరంతర ప్రయత్నాల ఫలితంగా జాజులపాలెం%-%అంజలి శనివారం వరకు సుమారు 6 కిలోమీటర్ల రహదారి పనులు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జూలై నెలలో పూర్తి చేశారు. అయితే, కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రహదారి ముక్కలైపోవడంతో పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



**రోడ్డు మట్టిలో కలిసిపోయింది..!**

గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ రోడ్డు కొత్తగా వేసినప్పటికీ బిటుమెన్ పొర సరిగా వేయలేదు. మట్టి, చిన్న రాళ్లతోనే పనులు చేశారు. ప్రజలకు రోడ్డు కనిపిస్తే చాలు అన్న ధోరణితో అధికారులు పనులు పూర్తి చేశారు. వర్షాలు కురిసిన వెంటనే రోడ్డు గాలికి ఎగిరిపోయింది. వాహనాలు నడపడం ప్రమాదకరమైంది. చిన్న పిల్లలు, విద్యార్థులు, గర్భిణీలు, రోగులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రహదారే ఇలా అయితే పాత రహదారిని ఎందుకు మార్చాం? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పర్యవేక్షణ లోపం-కాంట్రాక్టర్ నిర్లక్ష్యం!**

పంచాయతీ ప్రజలు ఆరోపిస్తూ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పనులపై ఎటువంటి పర్యవేక్షణ చేయలేదు. కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలను పూర్తిగా ఉల్లంఘించాడు. డాంబరు పొర లేకుండా, తగిన మెటీరియల్ వినియోగం లేకుండా చేసిన పనులు వర్షం రాగానే మట్టిపాలయ్యాయి. ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులు నీటిలో కలిశాయని మండిపడ్డారు.

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి-ప్రజల డిమాండ్.**

ప్రజలు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, అల్లూరి జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని నాణ్యత ప్రమాణాలు పాటించకుండా రోడ్డు నిర్మాణం చేపట్టిన గుత్తేదారుడుపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



## ఆత్రేయపురంలో జాతీయ స్థాయి బోట్ ఫెస్టివల్

**టూరిజం అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు కసరత్తు**



**విజయవాడ, అక్టోబర్ 22:( తెలుగు రాష్ట్రం)** కొత్తపేట నియోజకవర్గంలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు బుధవారం విజయవాడలో ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ (APTDC) ప్రాజెక్టుల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ యం. శేషగిరిని కలుసుకుని పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. రాబోయే సంక్రాంతి సందర్భంగా ఆత్రేయపురంలో జాతీయ స్థాయి బోట్ ఫెస్టివల్ నిర్వహణకు అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో పడవల పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అందుబాటులోకి వచ్చే నిధులు, ఏర్పాట్లు, టూరిజం అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం మద్దతు అందించాలని సూచించారు. కొత్తపేట నియోజకవర్గంలోని లొల్లలాకులు, వాడపల్లి రివర్ ఫ్రంట్ రిసార్ట్స్, వాడపల్లి, మందపల్లి, పలివెల, ర్యాలి ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం అభివృద్ధి చర్యలు చేపట్టాలని చర్చించారు. మహానగరాలు, పుణ్యక్షేత్రాలకు బస్సు సదుపాయాలు, అనుమతులు, పర్యాటక అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులపై సమగ్ర చర్చ జరిగింది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ "నియోజకవర్గంలో ప్రభుత్వ, సామాజిక భాగస్వామ్యంతో టూరిజం రంగాన్ని అభివృద్ధి చేయడం మా ప్రధాన లక్ష్యం. కోనసీమ సౌందర్యాన్ని జాతీయ స్థాయిలో పరిచయం చేయడానికి ఇది మొదటి అడుగు" అని పేర్కొన్నారు.

## ర్యాలి ఉమా కమండలేశ్వర స్వామి ఆలయంలో
## విద్యుద్దీపాలంకరణ

**శివదీక్షలు ప్రారంభం**

**భక్తిశ్రద్ధలతో కార్తీకమాస వేడుకలు ప్రారంభం**





**ఆత్రేయపురం, అక్టోబర్ 22:( తెలుగు రాష్ట్రం)** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఉమా కమండలేశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా విద్యుద్దీపాలంకరణ నిర్వహించారు. ఆలయ ప్రాంగణం కాంతులతో నిండిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో శివదీక్షలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించారు. దీక్షలు స్వీకరించిన భక్తులు భగవంతుని నామస్మరణలో నిమగ్నమయ్యారు. కార్తీకమాసం ప్రారంభమైన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు విద్యుద్దీపాలతో దేవస్థానాన్ని అలంకరించగా, భక్తులు దీపదానంలో పాల్గొన్నారు. స్థానికులు ఈ కార్యక్రమం భక్తి వైభవంగా సాగిందని కార్యనిర్వాహణాధికారి భాగవతుల వెంకటరమణామూర్తి తెలియజేశారు.

## మందపల్లి మందేశ్వర స్వామి ఆలయంలో ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

**ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హాజరు**




**కొత్తపేట, అక్టోబర్ 22:( తెలుగు రాష్ట్రం)** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలోని శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానంలో నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమం అక్టోబర్ 24వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవనీయులు శ్రీ బండారు సత్యానందరావు గారు హాజరుకానున్నారు. ఎమ్మెల్యే సమక్షంలో నూతన ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి గ్రామ పెద్దలు, మాజీ దేవస్థానం చైర్మన్లు, భక్తులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హారతులు కూడా నిర్వహించబడతాయి. సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు మీడియా ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ ం "ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు అందరూ హాజరై వార్తను తమ మాధ్యమాలలో ప్రచురించవలసిందిగా కోరుతున్నాము" అని తెలిపారు.

## వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1.87 కోట్లు

**35 రోజుల కాలంలో వచ్చిన హుండీ లెక్కింపు వివరాలు విడుదల**








**వాడపల్లి, అక్టోబర్ 22:( తెలుగు రాష్ట్రం)** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, శ్రీ వెంకటేశ్వరస్వామి వారిదేవస్థానం, వాడపల్లిలో 35 రోజుల పాటు భక్తుల సమర్పణలతో వచ్చిన హుండీ ఆదాయాన్ని ఆలయ అధికారులు లెక్కించారు. మొత్తం ఆదాయం రూ.1,87,33,329 వచ్చినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి తెలిపారు. శ్రీ వెంకటేశ్వరస్వామి వారిదేవస్థానం శ్రీ విగ్రహర హుండీ నుండి రూ.1,41,69,487 మరియు అన్నదాన హుండీ నుండి రూ.45,63,842 వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తంలో దేశీయ కరెన్సీతో పాటు విదేశీ కరెన్సీ నోట్లూ సమర్పించబడ్డాయి. లెక్కింపు ప్రకారం 25 విదేశీ కరెన్సీ నోట్లు లభించాయి. వీటిలో అమెరికా, కువైట్, సింగపూర్, దుబాయ్, సౌదీ అరేబియా, ఆస్ట్రేలియా దేశాల నోట్లు ఉన్నాయి. మొత్తం 47 బ్యాగులు, 240 కవర్లు, 6 ధారాలు, 25 విదేశీ కరెన్సీ నోట్లు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపులో అసిస్టెంట్ కమిషనర్ (FAC) శ్రీ ద. సురేష్ బాబు, ఆలయ అధికారి జె. రామలింగేశ్వరరావు, ఈఓ పి.వి.వి.ఎస్. కృష్ణరావు పర్యవేక్షణలో లెక్కింపు పూర్తయింది. అధికారులు మాట్లాడుతూ "భక్తులు సమర్పించిన హుండీ నిధులను భద్రపరచి, బ్యాంకులో జమ చేశాం. లెక్కింపులో అన్ని విధాల పారదర్శకత పాటించాము" అని తెలిపారు.

# విద్యార్థిపై దాడిచేసిన మృగాన్ని కఠినంగా శిక్షిస్తాం.. : యనమల దివ్య





**తెలుగు రాష్ట్ర ప్రతినిధి తుని అక్టోబర్ 22**

తుని కూటమి కార్యాలయం గురుకుల పాఠశాల విద్యార్థిని దాష్టీక దుశ్చర్యకు పాల్పడిన మృగాడు ఎవడైనా తాట తీసేందుకు వెనుకాడని కూటమి ప్రభుత్వం తున ఘటనపై యనమల దివ్య ఆదేశాలతో 24 గంటల్లోనే నిందితుడిని కటకటాల వెనక్కి పంపించారు.అభం,శుభం తెలియని 8 వ తరగతి విద్యార్థినిపై కొండవారిపేటకు చెందిన మానవ మృగం నారాయణరావు దుశ్చర్య ను మున్సిపల్ చైర్ పర్సన్ నార్ల భువన సుందరి, వైస్ చైర్మన్ కుచ్చర్లపాటి రూపాదేవి కౌన్సిలర్లు తుమ్మలపల్లి సుశీల వారాహి జ్యోతి కర్రి శ్రీదేవి,సూరిశెట్టి సుబద్రదేవి తీవ్రంగా ఖండించారు. యినుగంటి సత్యనారాయణ,మోతుకూరి వెంకటేష్,మల్ల గణేష్ నేతృత్వంలో మహిళా కౌన్సిలర్లు బాధిత విద్యార్థినిని ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్బంగా మహిళా నేతలు మాట్లాడుతూ ఘటన సమాచారం తెలిసిన వెంటనే ప్రభుత్వ విఫ్ యనమల దివ్య దోషిపై కఠిన చర్యలు తీసుకుని తక్షణమే అరెస్ట్ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారని భువన సుందరి,రూపాదేవి తెలిపారు ఎమ్మెల్యే ఆదేశాలపై పోలీసులు స్పందించిన తీరు ప్రశంసనీయమని ఘటన జరిగి 24 గంటలోపులో నిందితుడిని అరెస్ట్ చేయడం భినందనీయమన్నారు.బాధితురాలికి ప్రభుత్వ పరంగా పార్టీ పరంగా అండగా నిలుస్తుందని దోషికి కఠిన చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు

# వైభవంగా కార్తీక మాసం ఉత్సవాలు



**అమలాపురం అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమలాపురం రూరల్ మండలం పాత బండారులంక శ్రీ భువనేశ్వరి సమేత త్రయంభ కేశ్వర స్వామి ఆలయంలో,,పవిత్ర కార్తీక మాసం,,ఉత్సవములు అత్యంత వైభవంగా నిర్వహించారు, ముందుగా, విఘ్నేశ్వరుడు కి కొండా దుర్గా సాయి ప్రకాష్ దంపతులుచే అష్ట ద్రవ్య అభిషేకం లు తో ప్రారంభించి మూల విరాట్ విగ్రహాలకు, నూతన వస్త్రాలు, పూల ???లు వేసి ఈ కార్తీక మాసం నెల రోజులు మా ఆలయానికి విచ్చేసి మమ్ములను అనుగ్రహముచాలని కోరుట అనంతరం ప్రసాదం వితరణ జరిగిన?? ,శ్రీ శైలంమాజీ ట్రస్టీ చింతా శంకర మూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సద్గురువు సత్యనారాయణ గారు పురోహితం చేయగా, దర్మకర్త పిచ్చిక వెంకన్న శ్రీమతి ఇందిరాదేవి ,చింతా అత్తిలింగం శ్రీమతి వీరభద్రమని , చింతా శంకర మూర్తి,శ్రీమతి చంద్రకళ, లక్కి%శీ%శెట్టి నాగ మల్లేశ్వరావు భ్రమరాంబ, పడవల తాతారావు దంపతులు, కొండా శ్రీనివాసరావు దంపతులు, %బ% లింగమూర్తి దంపతులు, చింతా ఉమా దంపతులు, గొల్ల మల్లేష్ రావు దంపతులు ఇంకా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ప్రముఖ వ్యాపారవేత్త విద్యాదాత చందన మోహనరావు మరణం తీరని లోటు



**అమలాపురం అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రముఖ వ్యాపారవేత్త విద్యా దాత కీ,,శే,,చందన మోహనరావు మరణం కలిచి వేసిందని, చాలా మంది పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు కృషి చేసి ఆర్థికంగా ఆదుకొన్నారు,, వస్త్ర వ్యాపారం లో అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు అని వక్తలు మాట్లాడరు బండారులంక దేవాంగ సంక్షేమం సంఘం అధ్యక్షులు బల్ల వెంకటేశ్వరరావు గారి ఆధ్వర్యంలో జరిగిన సంతాప సభ లో రాష్ట్ర దేవాంగ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, చింతా శంకర మూర్తి, పిచ్చిక శ్యామ్, మాడ మాధవి, కొండా శ్రీనివాసరావు, బల్ల చక్రవర్తి, ఆశపు చిన్ని, చింతపట్ల ???? సత్యనారాయణ, %బ% లింగ మూర్తి, జాన గణేష్, మావురి శివ ఇంకా దేవాంగ పెద్దలు పాల్గొన్నారు

# బస్టాపులో వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు

**చింతలపూడి, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం విలేకరి):**



ఏలూరు జిల్లా చింతలపూడి మినీ బస్టాండ్ లో వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో స్థానిక శాసనసభ్యులు రోషన్ కుమార్ ప్రయాణికుల సౌకర్యార్థం మినీ బస్టాండ్ ను ప్రారంభించారు. కానీ వసతులు కల్పించడంలో ఆర్టీసీ వారు విఫలమయ్యారు. ప్రయాణికులు వేచి ఉండటానికి కావలసిన కుర్చీలు గాని, ఫ్యానులు గాని, మంచినీటి వసతి గాని కల్పించ లేదు. ప్రయాణికులు ఎండలోనే పడిగాపులు కాస్తున్నారు. దయచేసి ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు కావలసిన సదుపాయములను సమకూర్చగలరని చింతలపూడి ప్రయాణికులు కోరుచున్నారు.

# ఘనంగా ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు

**హాజరైన ఎమ్మెల్యే అయితాబత్తుల**







**అమలాపురం అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమలాపురం, కొంకాపల్లి క్షత్రియ కళ్యాణమండపంలో జరిగిన యంగ్ రెబల్ స్టార్, పెన్ ఇండియా సూపర్ స్టార్ ఉప్పలపాటి ప్రభాస్ రాజు గారి పుట్టినరోజు వేడుకలలో పాల్గొన్న గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్తిబాబు రాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, ముత్యాల బాబీ, ఈతకోట నాగేశ్వరరావు, రొక్కాల నాగేశ్వరరావు మరియు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొమరం భీమ్ జయంతి



**చింతూరు, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం విలేకరి):**

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో కొమరం భీమ్ 125 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా కె. రత్న మాణిక్యం తెలియజేసారు. తొలుత కొమరం భీమ్ చిత్రపటానికి అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రత్న మాణిక్యం మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల కోసం అసఫ్ జాహి నిజాం నవాబ్ కు వ్యతిరేకంగా పోరాడిన అదిలాబాద్ జిల్లాకు చెందిన గిరిజనోద్యమ నాయకుడు కొమరం భీమ్ అనీ, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గెరిల్లా పద్ధతిలో పోరాడారన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ యం.శేఖర్ మాట్లాడుతూ కొమరం భీమ్ 'జల్, జంగల్, జమీన్' (నీరు, అటవీ, భూమి) అనే నినాదంతో అదిలాబాద్ జిల్లాలోని ఆదివాసులను సమీకరించి సాయుధ పోరాటం చేసారన్నారు. ఆయన చేసిన పోరాటం ఆదివాసి హక్కుల కోసం జరిగిన ఉద్యమాలకు చిహ్నంగా నిలిచిందన్నారు. చరిత్ర విభాగాధిపతి బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన అమరుడు కొమరం భీమ్ అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.శైలజ, ఆర్.మౌనిక, ఎం ఆనంద్, కె.లక్ష్మి ప్రసన్న కుమారి తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**తాడేపల్లిగూడెం, అక్టోబర్22 (తెలుగురాష్ట్రం విలేకరి):**




డైలీ వేజ్ కార్మికులును ఔట్ సోర్సింగ్ విధానంలోకి తీసుకోవాలని పలువురు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. దీనిలో భాగంగా మున్సిపల్ వర్కర్స్ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 3 నుంచి తలపెట్టిన సమ్మె సన్నాహాల్లో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా అధ్యక్షులు ఓవి రాజు, కార్యదర్శి ఎం.హరీష్, ఏ ఐ టీ యు సీ వర్కింగ్ ప్రెసిడెంట్ కలింగ లక్ష్మణరావు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుంచి మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు తిరిగి అవుట్సోర్సింగ్ విధానంలో పని కల్పనలో జరుగుతున్న జాప్యాన్ని తక్షణమే పరిష్కారం చేయాలని తెలిపారు. పర్మిట్ కార్మికులకు పెండింగ్లో ఉన్న డిఏని వెంటనే విడుదల చెయ్యాలని కోరారు. 12వ పిఆర్సిని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలన్నారు. మున్సిపల్, కార్పొరేషన్, నగర పంచాయతీల్లో పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల నిష్పత్తిని పెంచాలని, పర్మిట్ కార్మికుల పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, కనీస వేతనం రూ 26000 ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సెక్రెటరీ కె.ముత్యం, మార్లపూడి కాటమరాజు, అల్లం కుమార్, స్వామి, అల్లం నరేంద్ర, మండెల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**తాడేపల్లిగూడెం, అక్టోబర్22 (తెలుగురాష్ట్రం విలేకరి):**



డైలీ వేజ్ కార్మికులును ఔట్ సోర్సింగ్ విధానంలోకి తీసుకోవాలని పలువురు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. దీనిలో భాగంగా మున్సిపల్ వర్కర్స్ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 3 నుంచి తలపెట్టిన సమ్మె సన్నాహాల్లో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా అధ్యక్షులు ఓవి రాజు, కార్యదర్శి ఎం.హరీష్, ఏ ఐ టీ యు సీ వర్కింగ్ ప్రెసిడెంట్ కలింగ లక్ష్మణరావు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుంచి మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు తిరిగి అవుట్సోర్సింగ్ విధానంలో పని కల్పనలో జరుగుతున్న జాప్యాన్ని తక్షణమే పరిష్కారం చేయాలని తెలిపారు. పర్మిట్ కార్మికులకు పెండింగ్లో ఉన్న డిఏని వెంటనే విడుదల చెయ్యాలని కోరారు. 12వ పిఆర్సిని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలన్నారు. మున్సిపల్, కార్పొరేషన్, నగర పంచాయతీల్లో పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల నిష్పత్తిని పెంచాలని, పర్మిట్ కార్మికుల పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, కనీస వేతనం రూ 26000 ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సెక్రెటరీ కె.ముత్యం, మార్లపూడి కాటమరాజు, అల్లం కుమార్, స్వామి, అల్లం నరేంద్ర, మండెల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కొమరం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే చిర్రి

**జీలుగుమిల్లి, అక్టోబర్ 22 (తెలుగు రాష్ట్రం విలేఖరి):**



ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండల కేంద్రంలో బుధవారం కొమరం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొమరం భీమ్ జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన వీరుడు కొమరం భీమ్, జాతి స్వాతంత్ర్యం కోసం పోరాడిన గొప్ప గిరిజన యోధుడు కొమరం భీమ్ త్యాగాలు స్ఫూర్తిదాయకం అని ఆయన పేర్కొన్నారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన భీమ్ చూపిన మార్గంలో నేటి యువత నడవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పోలవరం నియోజకవర్గంలో కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనగు రవికుమార్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి రాము, జీలుగుమిల్లి సర్పంచ్ చిర్రి జగదాంబ, జడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపిపి కోర్సా పోశమ్మ, ఎంపీటీసీలు సున్నం సురేష్, నాలి శ్రీనివాస్,సర్పంచ్ కోర్సా వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు పూనెం ఆదిత్య, కొమరం భీమ్ యూత్ సభ్యులు చిర్రి శ్రీనివాస్, చిర్రి వెంకటేశ్వరరావు, పద్దం వెంకట కృష్ణ, తెల్లం హేమంత్, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కొమరం భీమ్‌కు నివాళులు అర్పించారు.

# ఆత్మ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం

**పాల్గొన్న ఎమ్మెల్యే సత్య ప్రభ**



**రౌతులపూడి, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం విలేఖరి):**

శంఖవరం మండల పరిధిలోని అన్నవరం హరిహర రిసార్ట్స్‌లో తుని జోన్ ఆత్మ కమిటీ పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకా మహోత్సవ కార్యక్రమంలో నియోజకవర్గం శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేసిన కొత్త పాలకవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. శంకవరం, రౌతులపూడి మండలాల కూటమి సభ్యులు ఈ ఆత్మ కమిటీలో భాగస్వాములుగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల ఆత్మ కమిటీ పాలకవర్గ సభ్యులు ఒకే కుటుంబంగా భావించి, రైతుల అభివృద్ధి కోసం కలిసి పని చేయాలన్నారు. రైతుల సమస్యలను తెలుసుకుని, వారికి సాంకేతిక అవగాహన, శిక్షణ, ప్రదర్శన క్షేత్రాలు, చైతన్య యాత్రలు నిర్వహించడం వంటి కార్యక్రమాల ద్వారా సహాయం చేయాల్సిన బాధ్యత ఆత్మ కమిటీలపై ఉందని సత్య ప్రభ సూచించారు.

వాతావరణ మార్పులు, పంటల ఎంపిక, మార్కెటింగ్ వంటి అంశాలపై రైతులకు సమయానుకూల సమాచారం అందించడం అత్యంత కీలకమని ఆమె తెలియజేశారు. ఉత్తమ రైతులను గుర్తించి ప్రోత్సహించాలి. అంతేకాక వారి విజయాలను ఇతరులకు ఆదర్శంగా చూపించాలన్నారు. ఆత్మ కమిటీ వ్యవసాయ రంగం, అనుబంధ రంగాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తారని ఆమె ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), ఎన్‌డిఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మికులకు సేఫ్టీ కిట్స్, ఇన్సూరెన్స్ బీమా కల్పించాలి

**ఆదివాసి జిల్లా అధ్యక్షులు సోడె ముత్తయ్య**



**కూనవరం, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం విలేఖరి):**

ఆదివాసి సంక్షేమ పరిషత్ 38 98/90 ఆదివాసుల సంప్రదాయాలు సంస్కృతి భాగంలోనే ఆర్థిక వనరులుగా ఉపయోగపడే తాటి చెట్లు, ఇప్ప చెట్ల నుండి సేకరించే ఉత్పత్తులు భాగంగా పెళ్లిలో, ఫంక్షన్లు, పండుగలు వంటి శుభ, అశుభ కార్యక్రమంలోని వినియోగించుకుంటారు తాటిచెట్లు ఇప్ప చెట్లు ఆరాధ్య దైవంగ భావిస్తారు అటువంటి చెట్లనుండి, ఇప్పపువ్వు, ఇప్ప పప్పు వంటి పలసయాలు సేకరించే క్రమంలో ఆదివాసులు ప్రమాదాలకు గురవుతుంటారు. అలాంటి ప్రమాదాలను నిరోధించడానికి తాటి చెట్టు గీత కార్మికులకు సేఫ్టీ కిట్స్ అందించడంతోపాటు ఆ కుటుంబాలకు ఆర్థిక భరోసా సదుపాయం కల్పించేందుకు బీమా సౌకర్యం కల్పించడం తోపాటు తాటి చెట్టు నుండి ఇప్పి చెట్టు నుండి లభించే ఉత్పత్తులతో ఆదివాసులకు ఆర్థికంగా ఎదిగేందుకు బెల్లం, నారా, నీరా, డ్రింక్, పీచుతో పరుపులు ఇప్పపూవుతో స్వీట్, లడ్డులు తయారు చేయు విధంగా పరిశ్రమలు ఏర్పాటుచేసి ఆదివాసులకు అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నాము. ప్రస్తుతం ఏజెన్సీల నుండి నిరుద్యోగ యువతీ యువకులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లి కంపెనీల్లో పని చేసుకుంటున్నారు. చింతూరు డివిజన్ ఐటిడిఏ ఏపీఓకి ఆదివాస సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో మెమొరండం ఇవ్వడం జరిగింది. ఈ విషయాన్ని పై అధికారులకు పంపిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతూరు డివిజన్ ప్రెసిడెంట్ సోడె రాఘవయ్య, చింతూరు డివిజన్ సెక్రటరీ మినప నాగేశ్వరరావు, ఆదివాసి సంక్షేమ పరిషత్ సీనియర్ నాయకులు మీడియం పండయ్య, రవ్వ ప్రసాద్, పూనెం చిన్న వీరభద్రం, పైద వీరయ్య, కర్ణం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫామ్ పంపిణి చేసిన సేవాసంస్థ

**పి. గన్నవరం, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం విలేకరి):**




రాజోలు గవర్నమెంట్ డిగ్రీ కళాశాల నందు 20 మంది పేద విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫామ్స్ కోనసీమ బ్లడ్ డోనర్స్ సేవా సంస్థ తరుపున అందజేయడం జరిగింది. గత కొంతకాలంగా ఈ సంస్థ ద్వారా ఉభయగోదావరి జిల్లాల్లో బ్లడ్ అవసరం వున్న ప్రతిఒక్కరికి రక్తాన్ని అందజేస్తు ఎంతో మంది ప్రాణాలను నిలబెట్టారు. అప్పుడప్పుడు ఇలాంటి సామాజిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్న కోనసీమ బ్లడ్ డోనార్స్ సంస్థ అధ్యక్షులు కాండ్రేగుల నరేంద్రను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమానికి రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘ ప్రధానకార్యదర్శి కాండ్రేగుల రాము, గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ అకౌంటెంట్ గుబ్బల శ్రీనివాస్, బ్లడ్ డోనార్స్ సంస్థ అధ్యక్షులు కాండ్రేగుల నరేంద్ర, సంస్థ సభ్యులు జై కుమార్, తాతాజీ, రవికిరణ్, సాయినాథ్, సాయి, చైతన్య పాల్గొన్నారు.

ఉభయ గోదావరి
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# కొమురం భీమ్ స్ఫూర్తితో ఆదివాసీల రిజర్వేషన్ ఉద్యమం



**కూనవరం, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం కోతలగుట్ట గ్రామం ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కొమురం భీమ్ జయంతి సందర్భంగా కొమురం భీమ్ విగ్రహా కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో కూనవరం మండలం కోతులగుట్ట గ్రామంలో గల ఆయన విగ్రహానికి కమిటీ సభ్యులు మరియు ఆదివాసీ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల హక్కులు, చట్టాలు, రిజర్వేషన్లు రోజు రోజుకు పాలక ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. అందులో భాగంగానే ఆదివాసులకు 5వ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న వంద శాతం ఉద్యోగ రిజర్వేషన్ కుట్ర చేసి తీయించారని, ఇది ముమ్మాటికీ రాజ్యాంగ ఉల్లంఘన అని విమర్శించారు. ఆనాడు కొమురం భీమ్ ఆదివాసీల హక్కుల కోసం నిజాం ప్రభుత్వం, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమించారని అలాంటి మరో ఉద్యమానికి మన ఊర్లో మన ఉద్యోగాలు, మన హక్కులు చట్టాల రక్షణ కోసం ఆదివాసీలు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఆదివాసీ సంఘాల జాతీయ సమన్వయ సభ్యులు మడివి నెహ్రూ, కొమురం భీమ్ విగ్రహ కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు న్యాయవాది మడివి రవితేజ, ఆదివాసీ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు తుష్టి జోగారావు, ఉయిక రాంప్రసాద్, బేతి ముత్తయ్య, చిచ్చడి చంద్రరావు, వేక లెనిన్, పాయం లక్ష్మణ రావు,కుంజా శ్రీను, చిచ్చడి రాము, తుష్టి రవి తదితరులు పాల్గొన్నారు.

# ఈవ్ టీజర్లు, అసాంఘిక కార్యక్రమాల నివారణపై ప్రత్యేక నిఘా



**టీ. నర్సాపురం, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
టి. నరసాపురం పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం డ్రోన్ నిఘా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిలుగుమిల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టి. నరసాపురం ఎస్ఐ జయబాబు తమ సిబ్బందితో కలిసి డ్రోన్ ఆపరేషన్‌ను నిర్వహించారు. పోలీస్ శాఖ అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని (డ్రోన్) ఉపయోగిస్తూ, ముఖ్య ప్రాంతాల సమస్యలపై నిఘా కొనసాగించింది. హైస్కూల్, కళాశాలల పరిసర ప్రాంతాల్లో ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిని, లేదా మహిళా విద్యార్థులకు ఇబ్బంది కలిగించే వారిని గుర్తించడంతో పాటు ప్రధాన కేంద్రాలుగా భావించే అనుమానాస్పద ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే కూడళ్లలో, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయేమోనని గమనించారు. ట్రాఫిక్ ప్రవాహాన్ని నియంత్రించడానికి అవసరమైన చర్యలపై సమాచారాన్ని సేకరించారు. ప్రజలకు అసౌకర్యం కలిగించేలా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి డ్రోన్ విజువల్స్‌ను ఉపయోగించారు.
ఈ డ్రోన్ నిఘా కార్యక్రమం ద్వారా, ప్రజల భద్రతకు ఏలూరు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అసాంఘిక కార్యకలాపాలపై ఆధునిక సాంకేతికత ద్వారా నిరంతరం నిఘా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

# రాపాక కుటుంబాన్ని పరామర్శించిన రఘురాం



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం విలేకరి):**
తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట గ్రామ మాజీ సర్పంచ్ రాపాక కృష్ణ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాపాక వెంకటేశ్వరరావుల మాతృమూర్తి మిస్సమ్మ కాలం చేశారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్సీపీ రాష్ట్ర రైతు విభాగం (ఆక్వా కల్చర్) వర్కింగ్ ప్రెసిడెంట్ వద్దీ రఘురాం నాయుడు బుధవారం కృష్ణ, వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిలో ధైర్యం, ఆత్మస్థైర్యం నింపి, ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మిస్సమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేష లత, ఎంపిటిసి సభ్యుడు మార్లపూడి సుబ్బారావు, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# అంత్య క్రియలకు అర్థిక సహాయం



**ఎటపాక, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
మండల పరిధిలోని గౌరిదేవిపేట పంచాయతీకి చెందిన తిరుపతి బోడమ్మ(80) అనారోగ్యంతో మృతి చెందారు. వారిది నిరుపేద కుటుంబం. అమరవరపు చిన రాము కౌసల్య దంపతులు అమరవరపు లత (38)గత 2 సంవత్సరాల క్రితం మృతి చెందారు. లత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ తిరుపతి బోడమ్మ అంత్యక్రియల కోసం 3 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అమరవరపు చిన రాము గత కొన్ని సంవత్సరాలుగా ఎవ్వరికి ఏ ఆపద వచ్చిన నేను ఉన్నాను అంటూ ముందుకు వస్తున్నారు. గ్రామ పంచాయతీలో ఇటువంటి సేవ గుణం ఉన్న వ్యక్తి ఉండటం మా అదృష్టం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమరవరపు రాము మాట్లాడుతూ గత 30 సంవత్సరాల క్రితం తిరుపతి బోడమ్మ నేను వ్యవసాయ పనులకు కూలీలుగా వెళ్ళేవారమనీ, నాకు తెలియని పని రాకపోయినా బోడమ్మ నాకు నేర్పేదని, ఆ విషయాన్ని ఆ మర్చిపోలేక నావంతు సహాయం చేస్తున్నాననీ వారి కుటుంబాలకు నేను ఎంత ఇచ్చిన తక్కువే అని అన్నారు ఈ కార్యక్రమంలో ముక్కెర భద్రరావు మల్లెల లక్ష్మణరావు, కోలూరి వెంకటాచారి, బుడగం హరి తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థకు చేరుకున్న పంచాయతీ భవనం



**అనంతగిరి, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం విలేకరి):**
గత ప్రభుత్వం హయాంలో కొన్ని ప్రాంతాలలో కొత్త సచివాలయ భవనాలు ఏర్పాటు కావడంతో పాత పంచాయతీ భవనాలు ను ప్రజలు, పంచాయతీ అధికారులు, పంచాయతీ నాయకులు పూర్తి స్థాయిలో విడిచి పెట్టడం జరిగింది. అనంతగిరి మండలంలో కాశీపట్నం పంచాయతీలో పాత పంచాయతీ భవనం లోపల, పైన పిచ్చి మొక్కలు వత్తుగా పెరుగుతున్నాయి. పాత భవనం విడిచి పెడితే సిదిలావస్థకు చేరుకుంటుంది. కనుక స్థానిక పంచాయతీ నాయకులు, అధికారులు పిచ్చి మొక్కలు లేకుండా తొలగించి పరిశుభ్రత చేయించాలని స్థానికులు తెలిపారు.

# ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ముంపుకు గురవుతున్న లోతట్టు ప్రాంతాల పరిశీలన...

**నగరంలో ఆక్రమణలు, ప్రభుత్వ స్థలంలోనికి చొచ్చుకు వచ్చిన నిర్మాణాల యజమానులకు నోటీసులు జారీ చేయాలి..**
**బివి రాజు పార్క్, ఎడ్వర్డ్ ట్యాంక్ లలో పెడలింగ్ బోట్స్ నడిపేందుకు చర్యలు చేపట్టాలి...**
**వీరమ్మ పార్క్ కి ముందు వైపు తోపుడుబండ్ల దగ్గర పరిశుభ్రంగా ఉంచాలి...**
**బీసీ కాలేజ్ బాయ్స్ హాస్టల్ లో రన్నింగ్ వాటర్, త్రాగునీరు స్వచ్ఛంగా అందించాలి..**
**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**





**భీమవరం అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని నీటి పారుదలకు ఏ విధమైన ఆటంకాలు లేకుండా మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి భీమవరం పట్టణంలోని పలు ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆగకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్ల మార్జిన్ లో, లోతట్టు ప్రాంతాల్లోని నీటిని మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగిపోయేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అల్పపీడం దృష్ట్యా రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని దీని దృష్టిలో ఉంచుకొని ఎక్కడ పారిశుధ్య లోపం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో ఆక్రమణలను గుర్తించడంతోపాటు, రోడ్డు మార్జిన్లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టిన భవన యజమానులకు నోటీసులు జారీచేసి, తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సోమేశ్వర స్వామి దేవస్థానం ముందు పారిశుధ్య ఏర్పాట్లను పరిశీలించారు. కార్తీక మాసంలో దేవాలయ ప్రాంగణాలు అత్యంత పరిశుభ్రతగా ఉండేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దేవాలయం ముందు రోడ్డు నిర్మించాలని, అలాగే ఎదురుగా ఉన్న చెరువులో స్పీడ్ బోట్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. బివి రాజు పార్క్ పరిశీలిస్తున్న సందర్భంలో ముందువైపున ఉన్న వివిధ రకాల తినబండారాల బండ్ల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. బండ్లకు, ప్రహరికి మధ్య ఉన్న స్థలంలో షాపులు నిర్మాణానికి పరిశీలించాలని సూచించారు. బివి రాజు పార్కులో పెడలింగ్ బోట్స్ ను శనివారం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కు తెలిపారు. ఎడ్వర్డ్ ట్యాంక్ ను పరిశీలించిన సందర్భంలో జిమ్ ఏరియా లో నీరు నిలవకుండా డ్రయిన్ లో కలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎడ్వర్డ్ ట్యాంక్ లో పెడలింగ్ బోట్స్ తిప్పటానికి ఏర్పాట్లు చేయాలన్నారు. బుధవారం మార్కెట్ రైల్వే అండర్ పాస్ కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ బిసి వెల్ఫేర్ కాలేజీ బాయ్స్ వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థులను మౌలిక వసతులపై ఆరా తీశారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, బాగా చదువుతున్నారా, ఏ యే కోర్సులు చేస్తున్నారు అంటూ పలకరించారు. త్రాగునీటికి ఇబ్బంది ఉందని, రన్నింగ్ వాటర్ శుభ్రంగా లేవని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే ఈ మున్సిపల్ అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని, జీవితంలో ఒక స్థాయికి ఎదగడానికి ఇదే సరైన సమయం అని ఉద్బోధించారు. ఈ సందర్భంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ టి.త్రినాధ రావు, ఎంహెచ్ఓ ఆర్.సోమశేఖర్, జిల్లా దేవాదాయ శాఖ అధికారి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఏ.వి సూరిబాబు, వసతి గృహ సంక్షేమ అధికారి కె.నాగమోహన్ రావు, తదితరులు ఉన్నారు.

# తునిలో మైనర్ బాలికపై అత్యాచారయత్న ఘటనపై 'మహిళా కమిషన్" సీరియస్

**- ఆ కీచకుడి భరతం పట్టండి..**
**- కాకినాడ ఎస్పీని కోరిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ**
**- బాలికల భద్రతకు విరుద్ధంగా పనిచేస్తే ఏ స్థాయివారైనా వదలొద్దంటూ ఆదేశాలు**



**అమరావతి, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
కాకినాడ జిల్లా తునిలో మైనర్ గురుకుల విద్యార్థినిపై జరిగిన అత్యాచారయత్న ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బంధువునంటూ విద్యార్థినిని పాఠశాల నుంచి తోటల్లోకి తీసుకెళ్ళి వేధించిన కీచకుడి ఉదంతం బుధవారం సోషల్ మీడియాలో దుమారం రేగింది. దీనిపై తక్షణమే స్పందించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్ లో మాట్లాడారు. ఆ కీచకుడి భరతం పట్టాలని కోరారు. ఈ ఉదంతంపై కమిషన్ సుమోటోగా కేసును స్వీకరిస్తున్నట్లు కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ చెప్పారు. కేసు దర్యాప్తును వేగవంతంగా నిర్వహించాలని, నిందితుడిపై పోక్సో చట్టం కింద కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనర్ బాలికలపై ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడిన ఏ స్థాయి వారైనా వదలకుండా కఠినంగా శిక్షించాల్సిందేనని చెప్పారు. బాధిత బాలికకు తక్షణ రక్షణ, వైద్య సహాయం, చట్టపరమైన మద్దతు అందించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఆదేశాలు జారీ చేశారు. ఘటనపై పూర్తి నివేదికను 48 గంటల్లోగా కమిషన్‌కు సమర్పించాలంటూ జిల్లా పోలీసు శాఖకు నోటీసు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా గురుకుల పాఠశాలల్లో భద్రతా చర్యలను కఠినతరం చేయాలని రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ(%ూూూౌ=జు×ూ%)కు లేఖల ద్వారా సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాయపాటి శైలజ మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతకు విరుద్ధమైన ఏ చర్యలైనా కమిషన్ సహించదని, నిందితులకు కఠినమైన శిక్ష విధించేలా న్యాయ ప్రక్రియను పర్యవేక్షిస్తామని ఆమె స్పష్టం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**వి.ఆర్.పురం, అక్టోబర్22 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని రాజుపేట కాలనీ గ్రామానికి చెందిన గంపల వెంకటేశ్వర్లు కుమారుడు రఘురాం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది వివరాల లోకివెళితే మృతుడు రఘురాం (27) స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. భార్య ఉన్నత చదువుల కోసం రాజమహేంద్రవరం లోని కాలేజీ లో చదువు తుండగా, ఆమెను చూసి తిరుగు ప్రయాణం లో ఈ దురఘటన జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే రాజుపేట కాలనీ గ్రామం లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు మృధుస్వభావి, మంచి వ్యక్తిత్వం కలవాడు అవడంతో పలువురు నాయకులు, అధికారులు ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండల తహసిల్దార్ సరస్వతి, సిబ్బంది మృతుని కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతునికి తల్లి వెంకటరమణ, భార్య గాయత్రి(20), ఎనిమిది నెలల చిన్న పాప ఉన్నారు.

# పేపర్ మిల్లు కాలుష్యాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బాలరాజు



**జీలుగుమిల్లి, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం విలేకరి):**
ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండల పరిధిలోని రైతులు ఎదుర్కొంటున్న కాలుష్య సమస్యపై పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దృష్టి సారించారు. ఆంధ్ర%-%తెలంగాణ సరిహద్దులోని అశ్వరావుపేట ప్రాంతంలో ఉన్న శ్రీ లక్ష్మీ తులసి పేపర్ మిల్లు నుండి వ్యర్థ జలాలు విడుదలవుతున్నాయి. ఈ వ్యర్థ జలాల వలన జీలుగుమిల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో పశుపక్షాతులు, పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని రైతులు ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదుల మేరకు ఎమ్మెల్యే బాలరాజు కాలుష్య నియంత్రణ అధికారులతో కలిసి వాగు ప్రాంతాన్ని పరిశీలించారు. వ్యర్థ జలాలు చేరుతున్న ప్రాంతాన్ని స్వయంగా చూసి రైతులకు జరుగుతున్న నష్టాన్ని ఆయన అంచనా వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సమస్యలపై ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం, పంటల రక్షణ కోసం అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని కాలుష్య నియంత్రణ శాఖ (పిసిబి) అధికారులను ఆయన ఆదేశించారు. పేపర్ మిల్లు నుండి వచ్చే వ్యర్థాలను శుద్ధి చేయకుండా బయటకు వదలకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.
ప్రజల ప్రయోజనమే మా ప్రాధాన్యత' అని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అధికారులకు, రైతులకు తెలిపారు. కాలుష్యాన్ని నియంత్రించి, రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# పంచాయితీ ఎన్నికలకు జన సైనికులు సంసిద్ధంగా ఉండాలి

**-మండల జనసేన పార్టీ అధ్యక్షులు సాయి కృష్ణ**



**వి.ఆర్. పురం, అక్టోబర్ 22 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
ములకపల్లి పంచాయతీలో వి.ఆర్.పురం జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ ఐడి కార్డులు,పార్టీ సిద్ధాంతాలతో కూడిన పేపర్లు కిట్లు పంపిణీ చేయడం జరిగింది. స్థానిక పంచాయతీ నాయకులు నూనె రాజు, ఆసు నారాయణలకు పంచాయతీ కి సంబందించిన సభ్యుల ఐడి కార్డులు ఇవ్వడం జరిగింది. అధ్యక్షులు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పంచాయతీలో పార్టీ బలోపేతం దిశగా అడుగులు వేయాలని, ముందస్తు ప్రణాళికతో ఇప్పటినుండే ప్రజల్లోకి వెళ్లాలని సూచించడం జరిగింది. అనంతరం పంచాయతీ సచివాలయాన్ని సందర్శించడం జరిగింది. పంచాయతీకి సంబంధించిన సమస్యలను,సచివాలయ పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకోవడం జరిగింది. అన్ని శాఖలకు సంబంధించిన సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రజల సమస్యలు పరిష్కరించాలని తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బాగుల అంజనరావు, సహాయ కార్యదర్శి మాచర్ల వేణుబాబు, యూత్ వైస్ ప్రెసిడెంట్ పెదపెట్ల పవన్ కళ్యాణ్, కోట్ల సాయిబాబు, నూనె అజిత్, పండా కిషోర్, నూనె సాయి వర్ధన్, తరుణ్, స్థానిక వీఆర్వో పూజారి అప్పారావు, డిజిటల్ అసిస్టెంట్ లక్ష్మి, అగ్రికల్చర్ అసిస్టెంట్ గొర్రె శరత్ పవర్, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరావు, సర్వేయర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మారం వెంకటేశ్వరరావు

**తాడేపల్లిగూడెం, అక్టోబర్22 (తెలుగురాష్ట్రం విలేకరి):**



అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన ఆర్య వైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్, జనసేన నాయకులు మారం వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ సలహా బోర్డు చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మారం వెంకటేశ్వరరావు గత కొంతకాలంగా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు, ఆధ్యాత్మిక, దైవ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటు నియోజకవర్గంలో తనదైన ముద్ర వేసుకున్నారు. ఈయనకు తాడేపల్లిగూడెం, పెంటపాడు, ఉంగుటూరు మండలాలకు చెందిన పలువురు నాయకులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# రెండు బిగ్ మ్యాచ్‌లపై టీమ్ఇండియా 'గురి'వారం!

గురువారం.. ప్రతి వారంలో వచ్చే రోజే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. ఇది భారత క్రికెట్ అభిమానులకు అత్యంత కీలకమైన రోజు. చావోరేవోలాంటి రెండు మ్యాచులపై గురి పెట్టాల్సిన రోజు. ఎందుకు ఇంత ఉపోద్ఘాతం అంటారా? అయితే, ఆ రెండు మ్యాచులు ఏంటి? ఎందుకు అంత కీలకమో ఓ లుక్కేద్దామా మరి..



### ఓడితే సిరీస్‌తోపాటు..

ప్రస్తుతం భారత పురుషుల క్రికెట్ జట్టు ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది. తొలుత మూడు వన్డేల సిరీస్‌లో బరిలోకి దిగింది. ఇప్పటికే పెర్త్ వేదికగా జరిగిన మొదటి పోరులో టీమ్ఇండియా ఓడింది. ఇక సిరీస్‌ను కోల్పోకుండా సజీవంగా ఉంచుకోవాలంటే రెండో మ్యాచ్‌లో గెలవడం అత్యంత కీలకం. కేవలం సిరీస్ గురించి మాత్రమే కాకుండా.. ఇద్దరు స్టార్ ప్లేయర్ల ఆటతీరుపైనా అభిమానులు, విమర్శకులు దృష్టి సారించే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే తొలి మ్యాచ్‌లో ఆ ఇద్దరు ఘోరంగా విఫలమయ్యారు. ఇక రెండో మ్యాచ్‌లో ఎలా ఆడతారో చూడాలి. ఇంకా అర్థం కాలేదా? ఆ ఇద్దరు ప్లేయర్లు ఎవరో తెలుసా? మన స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో ఆడిన తొలి వన్డే కూడా ఇదే. ఈ మ్యాచ్‌లో విరాట్ డకౌట్ కాగా.. రోహిత్ 8 పరుగులకే పెవిలియన్‌కు చేరాడు. మరోవైపు రెండో వన్డేలో రోహిత్ శర్మను రిప్లేస్ చేస్తారనే వార్తలూ వస్తున్నాయి. యశస్వి జైస్వాల్‌తో ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ఎక్కువ సమయం మాట్లాడటమే దానికి కారణమంటూ తెలుస్తోంది. అయితే, అతడిని పక్కన పెట్టే అవకాశాలు చాలా తక్కువేనని భారత బ్యాటింగ్ కోచ్ వ్యాఖ్యలను బట్టి తెలుస్తోంది. ఒక్క మ్యాచ్‌తోనే సీనియర్ల ప్రదర్శనను అంచనా వేయడమూ కరెక్ట్ కాదు. అయితే, తుది జట్టులో కుల్‌దీప్ యాదవ్‌కు చోటు కల్పించాలనేవారూ లేకపోలేదు. మరి ఎవరిని తప్పిస్తారనేది ఆసక్తికరమే.

### స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ ఓటీటీలో ప్రత్యక్ష ప్రసారం

భారత్ తుది జట్టు (అంచనా): రోహిత్ శర్మ/యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్, సుందర్/కుల్‌దీప్, నితీశ్ కుమార్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, సిరాజ్

### అసలు ప్రమాదం ఇదే..

మెన్స్ క్రికెట్‌లో రేపటి మ్యాచ్‌ను ఓడినా పెద్ద నష్టమేం ఉండదు. కాకపోతే ఓ సిరీస్‌ను కోల్పోవాల్సి ఉంటుంది. అదే మహిళల క్రికెట్‌లో మాత్రం 'ట్రోఫీ' దక్కే ఛాన్స్‌ను మిస్ చేసుకున్నట్లే అవుతుంది. ఎందుకంటే సెమీస్‌కు చేరుకోవాలంటే ఇక్కడ్నుంచి మిగిలిన రెండు మ్యాచులూ భారత మహిళా జట్టుకు గెలవడం అత్యంత కీలకం. టాప్ -4లో స్థానం కోసం న్యూజిలాండ్ కూడా ఈ రేసులో ఉంది. గురువారం రోజున కివీస్‌తోనే టీమ్ఇండియా తలపడాల్సి ఉంది. ఇందులో గెలిస్తే పెద్దగా ఇబ్బందుల్లేకుండానే సెమీస్‌కు భారత్ చేరుకుంటుంది. చివరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించడం పెద్ద కష్టమేం కాదు. ఇప్పటికే దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ సెమీస్‌కు అర్హత సాధించాయి. ప్రస్తుతం భారత్ (5 మ్యాచుల్లో 4 పాయింట్లు), న్యూజిలాండ్ (5 మ్యాచుల్లో 4 పాయింట్లు), శ్రీలంక (6 మ్యాచుల్లో 4 పాయింట్లు) నాలుగో బెర్తు కోసం పోటీపడుతున్నాయి. బంగ్లా, పాక్ ఇప్పటికే ఎలిమినేట్ అయిపోయాయి. ఒకవేళ న్యూజిలాండ్‌తో మ్యాచ్ వర్షం కారణంగా రద్దైనా.. భారత్ తన చివరి మ్యాచ్‌లో బంగ్లాను ఓడిస్తే చాలు సెమీస్‌కు చేరుతుంది. మరోవైపు కివీస్ చివరి పోరు ఇంగ్లాండ్‌తో ఉంది. ఆ జట్టును ఓడించడం అంత సులువేం కాదు.

### మధ్యాహ్నం 3 గంటలకు మ్యాచ్ ప్రారంభం

స్టార్‌స్పోర్ట్స్ ఛానళ్లు, హాట్‌స్టార్ ఓటీటీల్లో ప్రత్యక్ష ప్రసారం

భారత తుది జట్టు (అంచనా): ప్రతీకా రావల్, స్మృతి మంధాన, హర్లీన్ డియోల్, హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), దీప్తి శర్మ, రిచా ఘోష్, అమన్‌జోత్ కౌర్, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్

# షార్ట్ టర్మ్ గోల్స్ పెట్టుకొంటేనే ఉత్తమం

## : విరాట్‌కు రికీ సూచన

**విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కేవలం వన్డేల్లోనే కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. అయితే, ఆసీస్‌తో తొలి వన్డేలో రాణించలేకపోయారు. వారిని ఆడించడంపై పలువురు విమర్శలు చేస్తుండగా.. మరికొందరు మాత్రం కాస్త సమయం ఇవ్వాలని చెబుతున్నారు. క్రికెట్‌లో అన్నీ సాధించారు ఇంకెంతకాలం ఆడతారనే వ్యాఖ్యలూ వినిపించాయి. ఈ క్రమంలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ స్పందించాడు. ఎవరినుంచైనా తనకు ఇలాంటి మాటలు వినడం అస్సలు నచ్చదని వ్యాఖ్యానించాడు.**

### రో - కో విఫలం.. అదంతా వాతావరణం వల్లే: బ్యాటింగ్ కోచ్



"నాకు ఇలాంటివి వినడం నచ్చదు. క్రికెట్ లేదా ఇతర గేముల్లో అంతా సాధించాం అని ఎవరినోటా వినిపించకూడదు. ఎందుకంటే ఆడేటప్పుడు చేయగలిగినవి చాలా ఉంటాయి. అందుకోసం షార్ట్ టర్మ్ గోల్స్‌ను నిర్దేశించుకోవాలి. అలాకాకుండా వచ్చే వన్డే ప్రపంచకప్ లోనే ఆడతానని భావించకూడదు. ఒక్కో అడుగు ముందుకేస్తూ సాగాలి. ఈ విషయంలో విరాట్ కోహ్లీ ప్రేరణ పొందే ప్లేయర్. తప్పకుండా అతడు ప్రశాంతంగా కూర్చొని... ఆస్ట్రేలియా సిరీస్‌లో తాను సాధించాల్సిన స్వల్పకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. అలా చేస్తాడని భావిస్తున్నా. వచ్చే ప్రపంచ కప్ వరకూ వేచి ఉంటూ సమయం గడపాల్సిన అవసరం లేదు. విరాట్, రోహిత్ గురించి మనకు చాలా తెలుసు. వారు అత్యుత్తమ దశలో ఉన్నప్పుడు.. భారత బెస్ట్ టీమ్‌లో సభ్యులు. అయితే ఇప్పటికి.. రాబోయే వరల్డ్ కప్ నాటికి ఉత్తమ ప్రదర్శనను రాబట్టగలరా? అనేది స్టార్ ప్లేయర్లు తెలుసుకోవాలి" అని రికీ వ్యాఖ్యానించాడు.

### వారిద్దరి పైనే చర్చ: మెక్‌గ్రాత్

"భారత్ - ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన తొలి వన్డే గురించి మాట్లాడటం కంటే రోహిత్, విరాట్‌ల పైనే ఎక్కువ చర్చ సాగుతోంది. చాలా రోజుల తర్వాత మైదానంలోకి దిగారు. ఎక్కువగా పేస్ జనరేట్ అయ్యే పెర్త్ పిచ్ నుంచి వారికి కాస్త ఇబ్బంది ఎదురైంది. భారత్ ఫస్ట్ బ్యాటింగ్ చేయడంతో వెనకబడింది" అని ఆసీస్ మాజీ పేసర్ గ్లెన్ మెక్‌గ్రాత్ తెలిపాడు.

# ఆ 'స్థానం' మారాలి.. సర్ఫరాజ్‌ను తీసుకోకపోవడంపై కారణమిదేనా!

**భారత స్టార్ ఆటగాడు రిషభ్ పంత్ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యాడు. దక్షిణాఫ్రికా Aతో తలపడేందుకు ప్రకటించిన భారత్ A జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. ఇదంతా ఓకే కానీ.. ఓ ఆటగాడి విషయంలోనే భారత సెలక్టర్లపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. అయితే, వారి కారణాలు భిన్నంగా ఉన్నప్పటికీ.. మంచి ప్రదర్శన చేస్తున్నప్పుడు కనీసం జట్టులోకైనా తీసుకోవాలి కదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇంతకీ ఆ ఆటగాడు ఎవరంటే సర్ఫరాజ్ ఖాన్. ఇటీవలే దాదాపు 17 కేజీల వరకూ తగ్గి ఫిట్‌నెస్ సాధించిన అతడు దేశవాళీలోనూ ఫర్వాలేదనిపించే ప్రదర్శన ఇచ్చాడు. కానీ, భారత్ A జట్టులో స్థానం దక్కలేదు. దీంతో అతడి టెస్టు భవిష్యత్తు ప్రమాదంలో పడిందనే వ్యాఖ్యలు వినిపించాయి. బీసీసీఐ సెలక్షన్ కమిటీ వాదన మాత్రం మరోలా ఉందని వార్తలు వస్తున్నాయి. సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం ఇవ్వలేకపోవడానికి అతడి బ్యాటింగ్ ఆర్డరే కారణమని తెలుస్తోంది.**



### పాక్ ఔట్.. భారత్‌లోనే మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్!

దక్షిణాఫ్రికా Aతో మ్యాచులకు యువ ఆటగాళ్లు ఆయుష్ మాత్రే, జగదీశన్‌ను భారత సెలక్టర్లు ఎంపిక చేశారు. సాయి సుదర్శన్‌ను పంత్‌కు డిప్యూటీగా నియమించారు. మాత్రే-జగదీశన్ జోడీ ఓపెనింగ్ చేసే అవకాశాలు ఉన్నాయి. సాయి సుదర్శన్ వన్‌డౌన్‌లో వస్తాడు. ఆ తర్వాత దేవదత్ పడిక్కల్, రజత్ పాటీదార్‌లో ఒకరు ఆడతారు. ఐదో స్థానంలో రిషభ్ పంత్ ఉండనే ఉన్నాడు. సర్ఫరాజ్ ఖాన్ కూడా ఎక్కువగా ఈ ఐదో స్థానంలోనే బ్యాటింగ్ చేస్తాడు. రంజీల్లో ముంబయికి ఆడేటప్పుడు కూడా అతడిది ఇదే స్లాట్. ఇప్పుడు పంత్ రావడంతో సర్ఫరాజ్‌ను బెంచ్‌కే పరిమితం చేయాల్సిన పరిస్థితి ఉంటుందనేది క్రికెట్ వర్గాల అంచనా. అందుకే, సర్ఫరాజ్‌కు అవకాశం ఇవ్వలేదని తెలుస్తోంది.

### ఇక కష్టమేనా?

భవిష్యత్తులో భారత జట్టుకు సర్ఫరాజ్ ప్రాతినిధ్యం వహించడం కష్టమేనా? అనే అనుమానాలు అభిమానులకు రావడం సహజమే. అయితే, అలాంటి పరిస్థితి ఏమీ ఉండదని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. కానీ, ఓ అంశంలో మాత్రం మార్పు చేసుకోవాల్సిన అవసరం ఉందనేది వారి సూచన. "ఇప్పటి వరకు ఐదో స్థానంలో ఆడుతోన్న సర్ఫరాజ్.. తన బ్యాటింగ్ ప్లేస్‌ను టాప్ ఆర్డర్‌లోకి మార్చుకోవాలి. అందుకోసం ముంబయి మేనేజ్‌మెంట్‌తో పాటు చర్చించాలి. ఒకవేళ అతడు ఐదు లేదా ఆరో స్థానంలోనే ఉంటే మాత్రం ఉపయోగం ఉండదు. ఎందుకంటే భారత జట్టు ఎక్కువగా ఆల్‌రౌండర్లకే ప్రాధాన్యం ఇస్తోంది. పంత్ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చే ఆటగాళ్లంతా ఇదేతరహా కలిగినవారే. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, నితీశ్ కుమార్.. ఇలా ఎవరైనా సరే ఆల్‌రౌండర్లు. అందుకే, సర్ఫరాజ్ టాప్ ఆర్డర్‌పై గురిపెట్టాలి" అని ఓ మాజీ సెలక్టర్ వ్యాఖ్యానించాడు.

# అదంతా అపోహే.. అలా ఎవరూ ఆడరు: సునీల్ గావస్కర్



**కొత్త సారథి నాయకత్వంలో పాత కెప్టెన్లు సరిగా ఆడరని సోషల్ మీడియా వేదికగా కామెంట్లు వస్తున్నాయి. నెట్టింట చాలామంది తమ ఊహాగానాలతోనే ఫ్యాన్స్ వార్స్ నిర్వహిస్తుండటం గమనార్హం. ఇప్పుడే కాదు.. సచిన్ తెందూల్కర్ vs ధోనీ, విరాట్ vs సచిన్, శుభ్‌మన్ గిల్ vs యశస్వి జైస్వాల్ వరకూ ఈ ఫ్యాన్ వార్స్ కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పుడు శుభ్‌మన్ గిల్ సారథ్యంలో తొలి వన్డే ఆడిన రోహిత్ శర్మ విఫలం కావడం పైనా అర్థం లేని చర్చ మొదలైంది. గిల్ కెప్టెన్సీలో ఆడేందుకు రోహిత్ ఇబ్బంది పడుతున్నాడంటూ కామెంట్లు వచ్చాయి. ఎందుకంటే, వన్డే సారథ్య బాధ్యతలు రోహిత్ నుంచే గిల్‌కు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, వీటన్నింటిపైనా భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఎవరూ కూడా కావాలనే ఇలా వ్యవహరించరంటూ వ్యాఖ్యానించాడు.**

### రో - కో విఫలం.. అదంతా వాతావరణం వల్లే: బ్యాటింగ్ కోచ్

"గత కొన్నేళ్లుగా భారత క్రికెట్ అభిమానుల్లో ఓ అపోహ ఉంది. ఒకరి స్థానంలో మరొకరు కొత్తగా సారథ్య బాధ్యతలు తీసుకుంటే.. అతడి నాయకత్వంలో సీనియర్ క్రికెటర్లు సరిగ్గా ఆడరని భావించడం అలవాటుగా మారిపోయింది. తమ అత్యుత్తమ క్రికెట్‌ను ప్రదర్శించకుండా నూతన కెప్టెన్‌ను ఇబ్బంది పెడతారంటూ కామెంట్లూ చేస్తారు. వారికి నిజం అవసరం లేదు. అసలు వాస్తవం ఏంటంటే.. కెప్టెన్సీ మార్చాక అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వకపోతే జట్టులో నుంచి తప్పిస్తారని కూడా ప్లేయర్‌కూ తెలుసు. అలాంటప్పుడు సారథ్యం కోల్పోయినందుకు ఎంత బాధపడినా.. ఏ ఆటగాడు కూడా ఉద్దేశపూర్వకంగా సరిగ్గా ఆడకుండా ఉండడు" అని గావస్కర్ వ్యాఖ్యానించాడు.

### వారి సహకారం అవసరం..

"ఇద్దరు సీనియర్ క్రికెటర్లను కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ హ్యాండిల్ చేయగలడా? ఇది చాలామందిలో ఉన్న సందేహం. వన్డే సిరీస్‌కు ముందే గిల్ ఈ విషయంపై స్పష్టత ఇచ్చాడు. కెప్టెన్‌గా వచ్చినా సరే వారిద్దరితో తన సంబంధాలు ఎప్పటిలానే కొనసాగుతాయన్నాడు. అవసరమైనప్పుడు తప్పకుండా సూచనలు, సలహాలు తీసుకుంటానని చెప్పడం బాగుంది. వీరిద్దరి వల్ల గిల్‌కే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. అత్యుత్తమ వన్డే ప్లేయర్లు జట్టులో ఉంటే కెప్టెన్‌కేగా లాభం" అని గావస్కర్ తెలిపాడు.

# నీరజ్ చోప్రాకు లెఫ్టినెంట్ కర్నల్ హోదా ప్రదానం



ఒలింపిక్ పతకాల విజేత నీరజ్ చోప్రాకు ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ హోదాను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రదానం చేశారు. ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన జావెలిన్ త్రో అథ్లెట్ నీరజ్ చోప్రా తొలుత సుబేదార్‌గా 2016లో జాయిన్ అయ్యారు. సుబేదార్ నుంచి 2021లో మేజర్‌గా పదోన్నతి పొందారు. 2022లో 'పరమ విశిష్ట సేవా పతకం'తో కేంద్రం సత్కరించింది. ఇప్పుడు మేజర్ నుంచి లెఫ్టినెంట్ కర్నల్‌గా హోదా అందుకొన్నారు. భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాన్ని 2021లో అందుకున్న నీరజ్ చోప్రా.. 2022లో పద్మశ్రీ అవార్డును అందుకున్నారు.

# పంత్ వచ్చేశాడు భారత్-ఎ కెప్టెన్‌గా ఎంపిక



భారత వికెట్‌కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ తిరిగి ఫిట్‌నెస్ సాధించాడు. గాయం నుంచి కోలుకున్న అతడు.. దక్షిణాఫ్రికా-ఎతో తలపడే భారత్-ఎ జట్టుకు కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. జులైలో ఇంగ్లాండ్‌లో నాలుగో టెస్టు సందర్భంగా పేసర్ వోక్స్ బంతి తగిలి పంత్ పాదం విరిగింది. దీంతో అతడు స్వదేశంలో వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌కు దూరమయ్యాడు. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు ముందు పంత్‌కు ఈ నాలుగు రోజుల మ్యాచ్‌లు విలువైన గేమ్ టైమ్‌ను ఇవ్వనున్నాయి. సాయి సుదర్శన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్న ఈ జట్టు తరఫున రాహుల్, సిరాజ్ సహా సీనియర్ జట్టులోని చాలా మంది ఆటగాళ్లు ఆడనున్నారు. బ్యాటర్ మార్కస్ ఆకర్‌మ్యాన్ నేతృత్వంలో దక్షిణాఫ్రికా-ఎ జట్టులో సీనియర్ టీమ్ కెప్టెన్ బవుమా కూడా ఉన్నాడు. 'ఎ' జట్ల మ్యాచ్‌లు రెండూ బెంగళూరులోనే జరుగుతాయి. తొలి మ్యాచ్ ఈ నెల 30 మొదలవుతుంది. రెండు జట్లు మూడు వన్డే మ్యాచ్‌ల్లోనూ తలపడతాయి. భారత్, దక్షిణాఫ్రికా సీనియర్ జట్ల మధ్య తొలి టెస్టు నవంబరు 14న మొదలవుతుంది. రెండో టెస్టు నవంబరు 26 నుంచి జరుగుతుంది. ఆ తర్వాత రెండు జట్లు మూడు వన్డేలు, అయిదు టీ20ల్లో ఢీకొంటాయి.

తొలి మ్యాచ్‌కు భారత్-ఎ జట్టు: పంత్ (కెప్టెన్), ఆయుష్ మాత్రే, జగదీశన్, సాయి సుదర్శన్ (వైస్ కెప్టెన్), పడిక్కల్, రజత్ పాటీదార్, హర్ష్ దూబె, తనుష్ కొటియాన్, మానవ్ సుతార్, అన్షుల్ కాంబోజ్, యశ్ ఠాకూర్, బదోని, సారాంశ్ జైన్

రెండో మ్యాచ్‌కు భారత్-ఎ జట్టు: పంత్ (కెప్టెన్), కేఎల్ రాహుల్, జురెల్, సుదర్శన్ (వైస్ కెప్టెన్), పడిక్కల్, రుతురాజ్, హర్ష్ దూబె, తనుష్, సుతార్, ఖలీల్, గుర్నూర్ బ్రార్, అభిమన్యు ఈశ్వరన్, ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్.

తెలుగురాష్ట్రం దినపత్రిక



# దీపావళి మెరుపులో.. చూపు తిప్పుకోనివ్వని దివి

గోల్డెన్ కలర్ లెహంగా ఓణీలో అచ్చం తెలుగింటి పడుచులా మెరిసిపోతోంది. హెవీ ఎంబ్రాయిడరీ వర్క్ ఉన్న బ్లౌజ్, దానికి తగిన జ్యువెలరీ, జడలో పూలతో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది.
'బిగ్ బాస్' షోతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమై, తన అందం, ముక్కుసూటితనంతో విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకుంది దివి వాద్యా. షో తర్వాత సోషల్ మీడియా సెన్సేషన్?గా మారిన ఈ బ్యూటీ, అటు సంప్రదాయబద్ధంగా, ఇటు గ్లామరస్?గా కనిపిస్తూ కుర్రాళ్లను ఆకట్టుకుంటోంది.దీపావళి పండగను పురస్కరించుకుని దివి లేటెస్ట్ గా షేర్ చేసుకున్న ఫొటోలు నెట్టింట వైరల్?గా మారాయి. గోల్డెన్ కలర్ లెహంగా ఓణీలో అచ్చం తెలుగింటి పడుచులా మెరిసిపోతోంది. హెవీ ఎంబ్రాయిడరీ వర్క్ ఉన్న బ్లౌజ్, దానికి తగిన జ్యువెలరీ, జడలో పూలతో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా బ్లౌజ్?లో ఆమె లుక్ ఫ్యాన్స్?ను కట్టిపడేస్తోంది. మోడల్?గా కెరీర్ ప్రారంభించిన దివి, కొన్ని షార్ట్ ఫిల్మ్స్, సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసింది. అయితే, 'బిగ్ బాస్ తెలుగు సీజన్ 4' ఆమె కెరీర్?కు అతిపెద్ద టర్నింగ్ పాయింట్?గా నిలిచింది. ఆ షోలో తన ప్రవర్తనతో, అందంతో తెలుగు రాష్ట్రాల్లో భారీ ఫ్యాన్ బేస్?ను సొంతం చేసుకుంది. 'బిగ్ బాస్' తర్వాత దివి కెరీర్ ఒక్కసారిగా ఊపందుకుంది. ఆమెకు సినిమా ఆఫర్లు క్యూ కట్టాయి. ఇప్పటికే పలు వెబ్ సిరీస్?లలో, సినిమాల్లో ముఖ్యమైన పాత్రలు పోషించింది. మెగాస్టార్ చిరంజీవి వంటి అగ్ర హీరోల చిత్రాల్లో సైతం అవకాశాలు దక్కించుకుని నటిగా తనను తాను నిరూపించుకుంటోంది. ప్రస్తుతం దివి చేతిలో పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. సినిమాలతో బిజీగా ఉంటూనే, సోషల్ మీడియాలో రెగ్యులర్?గా ఫొటోషూట్లు పోస్ట్ చేస్తూ అభిమానులకు నిత్యం టచ్?లో ఉంటుంది. అటు గ్లామర్, ఇటు టాలెంట్?తో ఇండస్ట్రీలో నిలదొక్కుకునేందుకు దివి గట్టిగానే ప్రయత్నిస్తోంది.

# 'మాస్ జాతర' చిత్రం నుండి మాస్ గీతం 'సూపర్ డూపర్' విడుదల

హైదరాబాద్ బ్యూరో : 'మాస్ జాతర' చిత్రం నుండి ఇప్పటికే విడుదలైన 'తు మేరా లవర్', 'ఓలే ఓలే', 'హుడియో హుడియో' గీతాలు శ్రోతలను విశేషంగా ఆకట్టుకొని, సామాజిక మాధ్యమాల్లో ఉర్రూతలూగించాయి. తాజాగా చిత్ర బఅందం, నాలుగో గీతంగా ఉత్సాహభరితమైన మాస్ పాట 'సూపర్ డూపర్'ను విడుదల చేసింది. రవితేజ మాస్ కి, శ్రీలీల ఎనర్జీకి తగ్గట్టుగా స్వరపరిచిన ఈ బ్లాక్ బస్టర్ ట్యూన్ అందరినీ కట్టిపడేస్తోంది. 'మాస్ జాతర' చిత్రాన్ని, ఆల్బమ్ ని మరింతగా ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లేలా ఈ 'సూపర్ డూపర్' గీతముంది. రెండు ఉత్సాహభరితమైన పాటలు, ఓ మంచి మెలోడీతో ఇప్పటికే 'మాస్ జాతర' ఆల్బమ్ ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. తాజాగా విడుదలైన మాస్ ని ఉర్రూతలూగించే ఈ 'సూపర్ డూపర్' గీతం, ఆ స్థానాన్ని మరింత పదిలం చేసింది. మునుపటి మాస్ మహారాజా రవితేజను గుర్తుచేసేలా, ఆయనకు మాత్రమే సాధ్యమయ్యే స్వాగ్ ఇందులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీలీల తన






అద్భుతమైన నృత్య ప్రదర్శనతో మరోసారి తెరపై వెలుగులు వెదజల్లారు. రవితేజ-శ్రీలీల ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ, ఈ మాస్ గీతాన్ని ప్రేక్షకులు మెచ్చే నిజమైన వేడుకలా మలిచాయి. 'సూపర్ డూపర్' గీతాన్ని సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో తనదైన శైలిలో అద్భుతంగా స్వరపరిచారు. మాస్ ని మెప్పించడంతో పాటు, అందరినీ కాలు కదిపేలా చేసేలా ఎంతో హుషారుగా ఈ గీతముంది. భీమ్స్ సిసిరోలియోతో కలిసి రోహిణి సోరట్ ఆలపించడం ఈ పాటకు మరింత హుషారుని తీసుకొని వచ్చింది. గీత రచయిత సురేష్ గంగుల అందరూ పాడుకునేలా ఉల్లాసభరితమైన సాహిత్యాన్ని అందించి ఆకట్టుకున్నారు. సంగీతం, గానం, సాహిత్యం అన్నీ చక్కగా కుదిరి.. 'సూపర్ డూపర్'ను ఓ గొప్ప మాస్ గీతంగా తీర్చిదిద్దాయి. తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు, 'మాస్ జాతర' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. చిత్ర ప్రకటన వచ్చినప్పటి నుండి 'మాస్ జాతర'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, మూడు పాటలకు విశేష స్పందన లభించింది. తాజాగా విడుదలైన నాలుగో గీతం 'సూపర్ డూపర్', సినిమా పట్ల ఆసక్తిని మరింత పెంచుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో జోరు పెంచింది. కొద్దిరోజులుగా ప్రత్యేక ఇంటర్వ్యూలతో సామాజిక మాధ్యమాల్లో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అలాగే, అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్రైలర్ కూడా త్వరలో రానుంది. ప్రేక్షకులకు పూర్తి స్థాయి మాస్ విందుని అందించడానికి అక్టోబర్ 31న 'మాస్ జాతర' చిత్రం థియేటర్లలో అడుగుపెట్టనుంది.



# కరుప్పు నుంచి 'గాడ్‌మోడ్' సాంగ్ రిలీజ్

కథానాయకుడు సూర్య నటించిన కొత్త సినిమా 'కరుప్పు'. త్రిష కథానాయిక. ఆర్జే బాలాజీ కథ, దర్శకత్వం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాష్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు. నటి స్వాశిక, ఇందిరన్స్, యోగిబాబు, శివదా, సుప్రీత్‌రెడ్డి, అనకా, మాయారవి, నట్టి తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే షుటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను శరవేగంగా జరుపుకుంటోంది. త్వరలోనే ఈ సినిమా విడుదల కోసం చిత్ర యూనిట్ ఏర్పాట్లు చేస్తోంది. దీపావళి పండగ సందర్భంగా 'గాడ్ మోడ్' అంటూ సాగే ఫస్ట్ సాంగ్‌ను మేకర్లు విడుదల చేశారు. నల్లని దుస్తులు, చేతిలో కత్తితో సూర్య నటించిన ఊరమాస్ ట్యూన్స్‌తో రూపొందించారు. సూర్య ఈ చిత్రంతో పాటు వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ద్విభాషా చిత్రంనూలో నటిస్తున్నారు. ఈ మూవీ షుటింగ్ కూడా కొనసాగుతోంది.

# సురేందర్‌రెడ్డితో రవితేజ సినిమా



రవితేజ, సురేందర్‌రెడ్డి కాంబినేషన్ మళ్లీ పునరావృతం కానుంది. 2009లో విడుదలైన 'కిక్' బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరూ మరో మాస్ ఎంటర్‌టైనర్ కోసం సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం కథా చర్చలు జరుగుతున్నాయి. 'ఏజెంట్' తర్వాత సురేందర్ రెడ్డి కొంత గ్యాప్ తీసుకొని స్టార్ హీరోలకు కథలు వినిపించారు. పవన్‌కళ్యాణ్‌తో సినిమా ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో, రవితేజ సినిమాను ముందుగా పట్టాలెక్కించే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం రవితేజ రెండు కొత్త ప్రాజెక్ట్‌లలో బిజీగా ఉన్నారు. 'కిక్' మూవీ రీమేక్‌ల రూపంలో తమిళం, హిందీ భాషల్లో కూడా విజయాలు సాధించింది. అయితే ఆ తర్వాత రవితేజ, సురేందర్‌రెడ్డి కాంబోలో వచ్చిన 'కిక్ 2' మాత్రం ఆ స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది.

# చిత్రీకరణలో 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'




శివాజీ, లయ జంటగా శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెంబర్ 2గా కొత్త చిత్రం తెరకెక్కుతోంది. సుధీర్ శ్రీరామ్ ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా టైటిల్‌ను మోషన్ పోస్టర్ ద్వారా విడుదల చేశారు. ఈ చిత్రానికి 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రంలో శివాజీ పంచాయతీ సెక్రెటరీ శ్రీరామ్ పాత్రలో కనిపించనున్నారు. '90' సిరీస్‌లో శివాజీతో కలిసి నటించిన రోహన్‌తో పాటు అలీ, ధనరాజ్, రఘుబాబు, 30 ఇయర్స్ పృధ్వీ, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్, రాజ్ తిరందాసు, కరణ్ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రంజిన్ రాజ్ సంగీతం అందిస్తున్నారు.

# దీపిక, రణ్ వీర్ ల కూతురును చూశారా..

**దీపావళి వేడుకల సందర్భంగా ఫ్యామిలీ ఫొటోను పంచుకున్న నటి**
**కూతురు దువా ఫొటోతో అభిమానులకు శుభాకాంక్షలు**
**సోషల్ మీడియాలో వైరల్ గా మారిన ఫొటో.. క్యూట్ గా ఉందంటున్న నెటిజన్లు**

బాలీవుడ్ సెలబ్రెటీ జంట దీపికా పదుకొణే, రణ్ వీర్ సింగ్ తమ కూతురు 'దువా'ను ప్రపంచానికి పరిచయం చేశారు. తొలిసారి కూతురు ఫొటోను సోషల్ మీడియా ద్వారా అభిమానుల కోసం పంచుకున్నారు. దీపావళి వేడుకల ఫొటోలతో పాటు కూతురు దువా ఫొటోను రివీల్ చేశారు. ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. పాప చాలా క్యూట్ గా ఉందంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. గతేడాది సెప్టెంబర్ లో దీపిక, రణ్ వీర్ జంటకు కూతురు పుట్టిన విషయం తెలిసిందే. పాపకు దువా అని నామకరణం చేసినట్లు వెల్లడించిన ఈ జంట.. ఇప్పటి వరకూ కూతురిని మీడియాకు కానీ, సోషల్ మీడియాలో ఫొటోలను కానీ పంచుకోలేదు. ఇతర సెలబ్రిటీలలాగే వీరు కూడా తమ బిడ్డ ప్రైవసీకి ప్రాధాన్యం ఇస్తూ "నో ఫొటో పాలసీ"ని అనుసరిస్తూ వచ్చారు. ఓసారి దీపిక తన కూతురుతో కలిసి ఎయిర్‌పోర్ట్‌లో కనిపించగా వీడియా తీసేందుకు ప్రయత్నించిన



మీడియాపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కూతురు ప్రైవసీని గౌరవించాలని కోరారు. అంతేకాదు, అప్పటి వరకు రికార్డు చేసిన వీడియోను తొలగించేలా సదరు మీడియా సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. అయితే, ఇన్నాళ్లు తమ కూతురి ఫేస్ ను సీక్రెట్‌గా ఉంచిన దీపిక, రణ్‌వీర్ సింగ్ జంట దీపావళి పండుగని పురస్కరించుకొని కూతురు దువాతో కలిసి దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి అభిమానులతో తమ ఆనందాన్ని పంచుకున్నారు.

# గుమ్మడి నర్సయ్య' చిత్రం నుంచి మోషన్ పోస్టర్ విడుదల

ప్రఖ్యాత రాజకీయ నాయకుడు, ప్రజా మనిషి గుమ్మడి నర్సయ్య జీవిత చరిత్రను తెరపైకి తీసుకు వస్తున్నారు. పేద ప్రజల గురించి ఆలోచించే రాజకీయ నాయకుడిగా గుమ్మడి నర్సయ్యకు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మంచి పేరు అందరికీ తెలిసిందే. ఇక గుమ్మడి నర్సయ్య పాత్రలో కరుణాడ చక్రవర్తి శివ రాజ్ కుమార్ నటించబోతున్నారు. ప్రవల్లిక ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్ మీద ఎన్. సురేష్ రెడ్డి నిర్మాతగా పరమేశ్వర్ హివ్రాలే దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కబోతోంది. ఈ మేరకు చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను, మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇక ఈ పోస్టర్‌ను, మోషన్ పోస్టర్‌ను చూస్తుంటే గుమ్మడి నర్సయ్య పాత్రకు శివ రాజ్ కుమార్ ప్రాణం పోసినట్టుగా కనిపిస్తోంది. ఆ లుక్, వేషధారణ అన్నీ కూడా అద్భుతంగా ఉన్నాయి. సైకిల్, వెనకాల ఉన్న అసెంబ్లీ, ఎర్ర కండువా ఇలా అన్నీ కూడా ఎంతో అథెంటిక్‌గా ఉన్నాయి. ఇక ఈ పోస్టర్‌తో ఒక్కసారిగా అంచనాలు పెంచేసినట్టు అయింది. ఇక మోషన్ పోస్టర్‌లో ఎమ్మెల్యేలు అంతా కూడా కారులో వస్తుంటే.. గుమ్మడి నర్సయ్య మాత్రం సైకిల్‌లో రావడం.. ఆ మ్యూజిక్, ఆర్ఆర్.. విజువల్స్ అన్నీ కూడా అద్భుతంగా అనిపిస్తోంది. నిర్మాత ఎన్. సురేష్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ ఎత్తున నిర్మించబోతోన్నారు. ఈ చిత్రానికి కెమెరామెన్‌గా సతీష్ ముత్యాల, సంగీత దర్శకుడిగా సురేష్ బొబ్బిలి, ఎడిటర్‌గా సత్య గిడుటూరి పని చేస్తున్నారు. త్వరలోనే మూవీకి సంబంధించిన ఇతర విషయాల్ని ప్రకటించనున్నారు.




TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339